# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

www.janashaktionline.com

సంపుటి : 45 సంచిక : 4 విజయవాడ 20-6-2012 పేజీలు : 8 వెల: రు 5.00



లోపలి పేజీల్లో...

- లక్ష్మింపేట దళితుల దాడికి ఖండన
- ఉత్తర ప్రదేశ్ ఎన్నికల పరిణామాలు
- రైతాంగానికి విత్తనాలు అందించని పాలకులు
- జార్ఖండ్ : భూమికొరకు పోరాటానికి పిలుపు
- పొగాకు రైతాంగాన్ని దోచుకుంటున్న ఐటిసి
- ప్రపంచ వ్యాపిత ప్రజాందోళనలు
- భారతదేశంలో ప్రజాందోళనలు


## అపహాస్య, బూటకపు ప్రజాస్వామ్య ప్రతీకలు-రాష్ట్రంలో ఉపఎన్నికలు

**రాష్ట్రవ్యాపితంగానే** గాక, దేశవ్యాపితంగా మీడియాపుణ్యాన ఉత్కంఠ రేపిన ఆంధ్రప్రదేశ్‌లోని 18 శాసనసభ స్థానాలకు, ఒకపార్లమెంటు స్థానానికి జరిగిన ఉపఎన్నికల ఘట్టం ముగిసింది.

రికార్డు స్థాయిలో మొత్తంగా 80 శాతం పైగా ప్రజలు ఓటుహక్కు వినియోగించుకున్నారని ఎన్నికల కమిషన్ సగర్వంగా ప్రకటించింది. ఎన్నికలలో వివిధ పార్టీల అభ్యర్థుల గెలుపోటముల చర్చ కాసేపు ప్రక్కనుంచి, ఈ ఎన్నికలు జరిగిన తీరును ఒకసారి విశ్లేషిస్తే 'పరిఢవిల్లుతున్న' ప్రజాస్వామ్య విషాదం తేటతెల్లమౌతుంది.

అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని, వెబ్‌కెమేరాల ద్వారా ఉపఎన్నికలు జరిగిన పోలింగ్ కేంద్రాలన్నిటినీ పర్యవేక్షించగలిగామనీ, ఫలితంగా ఎన్నికలలో అక్రమాలు జరగకుండా నిరోధించగలిగామనీ ఎన్నికల కమీషన్ జబ్బలు చరుచుకుంటున్న పరిస్థితుల నడుమే, అదే సాంకేతిక పరిజ్ఞానాన్ని వుపయోగించి వివిధ పాలకవర్గ పార్టీలు ఓటర్లను ప్రలోభపరిచే చర్యలను చేపట్టాయనేది బహిరంగ రహస్యమే. ఎటిఎంల ద్వారా ఓటర్ల ఖాతాల్లోకి నగదు బదిలీ మొదలు, సూక్ష్మరుణ సంస్థల ద్వారా నగదు పంపిణీ నుండి, బంగారు ఆభరణాల పంపిణీ, ఎస్సెమ్మెస్‌ల ద్వారా ఎన్నికల ఖర్చుకు లోబడకుండా సమాచార ప్రచార ప్రవాహాలతో పాటుగా, ప్రత్యక్షంగా డబ్బు, మందు తదితర రూపాలలో ఓటర్లను పెద్దఎత్తున ప్రలోభాలకు గురిచేశారనేది అందరికీ తెలిసిన వాస్తవమే.

పద్దెనిమిది అసెంబ్లీ, ఒక పార్లమెంటు నియోజకవర్గ ఉపఎన్నికల సందర్భంగా ఎన్నికల కమిషన్, సంబంధిత నిఘా అధికారులు స్వాధీనం చేసుకున్న నగదే 43 కోట్ల రూపాయలుపైగా వుందంటే, ఇక వీరి 'దృష్టికి రాకుండా' తరలిపోయిన డబ్బు ఏ స్థాయిలో వుంటుందో అంచనా వేసుకోవచ్చు. ఒక్క నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోనే అధికార, ప్రతిపక్షపార్టీల అభ్యర్థులు 300కోట్లకు పైగా డబ్బును వెచ్చిస్తున్నారని కొన్ని పత్రికలు చేసిన వ్యాఖ్యానాలలో అతిశయోక్తులున్నాయనుకున్నప్పటికీ, వీరి ఎన్నికల ఖర్చు పదులకోట్లను దాటి వందలకోట్లకు చేరిందనేది మాత్రం వాస్తవం. (ప్రజాస్వామ్య పరిరక్షణకు నడుంబింగించిన ఎన్నికల కమిషన్ దృష్టికి ఇవిరావుగాక, రావు!)

ఇక, ఎన్నికల ప్రచార విషయానికొస్తే, కాంగ్రెస్, వైయస్సార్ కాంగ్రెస్, తెలుగుదేశం పార్టీలు (బిజెపి, టిఆర్ఎస్‌లతో సహా) 'నీవు దొంగ అంటే నీవు గజదొంగ'వంటూ దుమ్మెత్తిపోసుకుంటున్న తీరు పాలకవర్గ పార్టీల రాజకీయ, నైతిక దిగజారుడుతనానికి పరాకాష్టగావుండి, జుగుప్సనుకలిగిస్తున్నాయి. ముఖ్యంగా నీతి-అవినీతిల చర్చ అధికంగా సాగిన ఈ ఉపఎన్నికల సందర్భంగా ఏ పార్టీకూడా తాము అవినీతి పరులం కానేకాదని గుండెల మీద చేయి వేసుకొని చెప్పగలిగిన స్థాయిలో కనీసంలేవు. 'నీవు అవినీతిపరుడివంటే, నీవు అంతకుమించిన అవినీతిపరుడివంటూ ఆరోపణలు, నికృష్ట దూషణలతో ఎవరికెవరూ తీసిపోరనే విషయాన్ని చెప్పకనే చెప్పుకున్నాయి. 'అవినీతి విశ్వవ్యాపితమ'ని వ్యాఖ్యానించిన ఆనాటి ప్రధాని ఇందిరాగాంధీనుండి, అవినీతి సర్వసాధారణమనే స్థాయికి ప్రజలను దిగజార్చటంలో ఈ పార్టీలు సమిష్టిగా కృషిచేసి నేటికి సఫలీకృతమయ్యాయి. ఏతావాతా ప్రజలకొక ప్రత్యామ్నాయం లేకుండా ఎవరో ఒక దొంగను ఎంచుకొనే విధంగా నెట్టివేసి, తదనుగుణంగా ఎవరికెవరూ తీసిపోనివిధంగా ప్రజలను ప్రలోభాలకు బలిచేసిన వీరే తమ తమ అభ్యర్థుల గెలుపోటముల అనంతరం, వీరి జత కలిసిన అధికార మేధావులతో గొంతుకలిపి ప్రజలనే దోషులుగా నిలిపే చోద్యాన్ని మనం చూస్తున్నాం.

వంద సం॥ల పైబడిన చరిత్రతో, ఊడలు దిగిన అవినీతి, అక్రమ సంపాదనలతో వర్ధిల్లుతున్న కాంగ్రెస్‌పార్టీ; దాని 'చల్లని నీడనే' అనతికాలంలోనే ప్రత్యర్థుల 'కళ్ళుచెదిరే' ప్రజాసంపదను దిగమింగి ఆ తానులో నుండి తండ్రి మరణానంతరం-ఇటీవలే విడివడిన, జగన్ నాయకత్వంలోని వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ; అధికారంలో నున్న కాలంలో అవినీతికి పట్టంగట్టి, అన్నీతానై దిగమింగిన చంద్రబాబు నాయకత్వంలో అధికారం కోసం అంగలార్చుతూ, ప్రతిపక్షంలో దీర్ఘకాలంగా ప్రతీక్షించటం దుర్భరంగా వున్న తెలుగుదేశం పార్టీలు-బిజెపి, టిఆర్ఎస్‌లతో సహా పాలకపార్టీలన్నీ ఎన్నికల రణరంగంలో ఎవరికివారు అధికారాన్ని కైవసం చేసుకునేందుకు పోటీపడుతూనే నీతి, నిజాయితీలని భూస్థాపితం చేయటంలో మూకుమ్మడిగా సహకరించుకుంటూనే ప్రజలకు భ్రమలు కల్పించేందుకు చెక్కకత్తులు దూసుకుంటూ, రక్తసిక్తగాయాలతో ఒకర్నిమరొకరు చెండాడుకుంటున్నట్లుగా నాటకాన్ని రక్తికట్టించాయి.

వాస్తవానికి, ఈ ఎన్నికల కారణంగా అతిపెద్ద నష్టానికి గురయ్యే వారుగా (బిగ్‌లూజర్స్‌గా) ప్రజలున్నారనే విషయాన్ని మరుగుపరచటంలో ఈ పాలకవర్గ పార్టీలన్నింటిదీ ఏకాభిప్రాయమే! పాలకుల అవినీతి మూలాలకు వ్యతిరేకంగా ఎక్కుపెట్టే చిన్నపాటి పోరాట మొలకలను కూడా నిర్దాక్షిణ్యంగా కాలరాచివేయటంలోనూ వీటికి బేధాభిప్రాయాలేమీలేవు. చట్టవిరుద్ధ ప్రజావ్యతిరేక కార్యకలాపాలు సాగించటంలోనూ, అవినీతి-అక్రమ సంపాదనలు-ప్రజాసంపాదనలను ఇబ్బడిముబ్బడిగా కొల్లగొట్టే దారిదోపిడీలపై, పైపై అరుపులతో అందినకాడికి ఆరగించటంలో అందరూ ఘనాపాటీలే! నిజాయితీగా ఆయా సమస్యల మూలాలపై ఎక్కుపెట్టిన, ముందుగానే ఈ సమస్యలను గుర్తించి ప్రజలను కదిలించిన సంస్థల కార్యకలాపాలకు ఈ పాలక పార్టీలు మద్దతుగా నిలవకపోగా ఉపేక్షవహించనవే, నీరుగార్చి వేయప్రయత్నించినవే! అధికార దాహంతో పాలకవర్గ పార్టీలు తమ మధ్య నెలకొన్న ముఠా కుమ్మలాటల్లో భాగంగా అవినీతి, అక్రమ సంపాదనలను ఒకరివి మరొకరు బయటపెట్టుకుని, వీటిపై గావు కేకలు వేస్తూ తామే ఈ దుర్మార్గాలను వ్యతిరేకించి పోరాడిన, పోరాడుతున్న యోధులుగా చిత్రీకరించుకునే ప్రయత్నం చేయటం వారి వంచనాత్మక కళకు నిలువెత్తు నిదర్శనం.

కాగా, నిరంతరం శీతల గదులలో కాలం గడిపే అధికార ప్రతిపక్ష నాయకమ్మన్యులంతా, 45 డిగ్రీల ఉష్ణోగ్రత దాటిన నడివేసవి ఎండలను సైతం లెక్కచేయక అధికార దాహంతో హోరాహోరీ పోరాడుకున్నారు. ఇదే కాలంలో వేసవి ఎండల ధాటికి ఎండుటాకుల్లా రోజూ పదుల సంఖ్యలో (రాష్ట్రంలోనే 380 మంది అని ఒక అంచనా-ఇంకా ఈ సంఖ్య ఎక్కువే) సామాన్య ప్రజల ప్రాణాలు అనంతవాయువుల్లో కలిసిపోతున్నా, అధికారం కోసం వెంపర్లాడే వీరెవరికీ ఈ సమస్య ప్రస్తావనార్హం కాకుండా పోయింది. రాష్ట్రంలో అందుబాటులోనున్న సహజవనరులను సక్రమంగా వినియోగించి ప్రజోపయోగానికి వెచ్చించటం ద్వారా విద్యుత్తు సమస్యను పరిష్కరించవలసిందిబోయి, ఇబ్బడిముబ్బడిగా బొగ్గు ఆధారిత వాణిజ్య థర్మల్ విద్యుత్తు కేంద్రాలకు అనుమతులివ్వటంలోనూ, ప్రత్యామ్నాయంగా అణువిద్యుత్ కేంద్రాలను అనివార్యంగా ఆమోదించే వైపుగా ప్రజలను నెట్టివేయటంలోనూ ఈ పాలక పార్టీలన్నీ చేతులు కలిపినవే!

అధికమైన విద్యుత్తు కోతలకు తోడు అడుగంటిన భూగర్భజలాలు, గుక్కెడు మంచినీళ్ళకు దిక్కులేక మైళ్ళకు మైళ్ళకు నడిచి వెళ్ళాల్సిన ప్రజల దుర్భరస్థితిగతులేవీ ఈ పార్టీలకు పట్టలేదు. పైగా విద్యుత్తు ఛార్జీల పెంపుద్వారా 4440 కోట్ల పెనుభారాన్ని రాష్ట్ర ప్రజలపై ప్రభుత్వం మోపినా, ప్రతిపక్షపార్టీలుగా చెప్పబడే వాటి ఆందోళన నామమాత్రమూ, మొక్కుబడి కార్యక్రమాలకే పరిమితమవటమూ ఎన్నికలలో ప్రజల ముందుకెళ్తున్నామన్న వెరపుకూడా లేకుండా ఇదే సందర్భంలో కేంద్రప్రభుత్వం లీటరు పెట్రోలుకు రు. 7.50 పైగా పెంచటంపై ప్రభుత్వాన్ని నిలదీసే ఉద్యమాలు రాకపోవటమూ కాకతాళీయం కాదు. పెరిగిన విద్యుత్, ఇంధన ఛార్జీలు, రవాణాభారాలకు తోడు, సరుకుగా మారిన మంచినీటితో సహా ప్రజల నిత్యావసరవస్తువుల ధరలను నియంత్రించటంలో కానీ; అభివృద్ధి పేరిట ప్రజలనుండి గుంజుకొని బడాసంపన్నులకు కట్టబెట్టిన వేలాది ఎకరాల భూములను తిరిగి ఆయా రైతులకు దక్కే చర్యలు చేపట్టటంలో అవినీతి అక్రమ సంపాదనలతో లుకలుకలాడుతూన్న, ఈ పార్టీలన్నీ విముఖంగానే వున్నాయనేదీ బహిరంగమే. పెరిగిన ఎరువుల ధరలు, తరుగుతున్న నీటి వనరులు, విత్తనాల కొరతలతో రైతాంగం ఎదుర్కొంటున్న నిత్యసంక్షోభాలపట్ల నిమ్మకు నీరెత్తినట్లుండమూ వీరి నిజ నైజమే!

కావున, అధికార, ప్రతిపక్ష, పాలక పార్టీలన్నీ బడాబూర్జువా, భూస్వామ్యవర్గ ప్రతినిధులుగా సామ్రాజ్యవాద ప్రయోజనాలకు కాపుగాస్తున్నాయనేది; ఈ దేశం నుండి ప్రజా సంపదల తరలింపులలోనూ, అవినీతి-కుంభకోణాలు, అక్రమ సంపాదనలలోనూ ఎవరికెవరూ తీసిపోరనేదీ ప్రజలకు నానాటికీ మరింతగా వెల్లడౌతున్నది. వీరి ఆధ్వర్యంలో నిర్వహింపబడే ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, నిజాయితీగా జరుగుతాయనుకోవటం పిచ్చితనమే అవుతుంది. ప్రజలను ఒకవైపున భ్రమలలోనూ,

**(తరువాయి 2వ పేజీలో)**

ప్రకటన

## సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల పర్యవసానమే

### విశాఖస్టీల్ ప్లాంట్‌లోని ఘోరప్రమాదం

**కేంద్ర** ప్రభుత్వరంగసంస్థ అయిన విశాఖపట్టణం స్టీలు ఫ్యాక్టరీలో ప్రమాదాలు జరగటం, భారీఎత్తున నష్టం ఏర్పడటం, ఉద్యోగులు ఆ ప్రమాదాల్లో మరణించటం అన్నది తరచు జరుగుతున్నది. ఒక్క మే నెలలోనే 3 ప్రమాదాలు జరగ్గా, ఇద్దరు కార్మికులు మరణించారు. ఫిబ్రవరి నెలనుండి మొత్తం 8 ప్రమాదాలు జరిగి వందలకోట్లరూపాయల ఆస్థినష్టం జరిగింది. ఈ నెల 13వ తేదిన జరిగిన ప్రమాదం, స్టీలుప్లాంటు చరిత్రలోనే అతిపెద్ద ప్రమాదంగావుంది. 16మంది అక్కడిక్కడే మరణించగా, 11మంది తీవ్రమయిన గాయాలతో మరణావస్థలో వున్నారు.

ఇది యాధృచ్ఛికంగా జరిగిన ప్రమాదం కాదు. ప్రభుత్వం అనుసరిస్తున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల పర్యవసానమే ఈ ప్రమాదం. తక్కువ ఉత్పత్తి ఖర్చు, ఎక్కువ లాభార్జన, కాంట్రాక్టీకరణ, అవుట్ సోర్సింగ్ అన్న విధానాలే పరిశ్రమల్లో పనిచేసే ఉద్యోగులను, కార్మికులను ప్రాణులుగా కాక, వర్తకపు సరుకుగా పరిగణించే వైఖరివల్లనే యిటువంటి ప్రమాదాలు దేశంలో అనునిత్యం జరుగుతున్నాయి. కార్మికుల ప్రాణాలు గాలిలో కల్సిపోతున్నాయి. స్టీలు ప్లాంటు విస్తరణలో భాగంగా సాగుతున్న విభాగాలలోనే ప్రమాదాలు జరగటమూ, నిర్మాణ పనులన్నీ కాంట్రాక్టు కివ్వటమూ, వారు సబ్ కాంట్రాక్టర్లకివ్వటమూ ఫలితంగా ప్రమాదాలు సంభవించటం ఈ విధానాల మూలంగానే జరుగుతున్నది.

ప్రమాదకరమైన పనులను కాంట్రాక్టులకు యివ్వటం, ప్రమాదభరితమైన పనుల్లో శిక్షణలేని కాంట్రాక్టు కార్మికులను వినియోగించటం, భద్రతా చర్యలను పట్టించుకోకపోవటం, భద్రతా చర్యలపై వెచ్చించాల్సిన కనీసపాటి కేటాయింపులను కూడా ఖర్చుపెట్టకుండా లాభాలను పెంచుకోవటం అన్నది ఈ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యొక్క ఉత్పత్తి విధానాలుగా వున్నాయి. వీటి పర్యవసానమే నేటి స్టీలుప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో మరణించిన, మరణశయ్యపైనున్న కార్మికుల, ఉద్యోగుల దుస్థితి.

భారీఎత్తున నష్టపరిహారాలు ప్రకటించటం, రకరకాల విచారణలకు ఆదేశించటం అన్నది ప్రస్తుతం ఆందోళన జరుగుతున్న ప్రజలను, కార్మికులను చల్లబర్చడానికి చేసే ప్రయత్నాలు తప్ప, అసలు సమస్య పరిష్కార దిశలో సాగుతున్నదికాదు.

ఇటువంటి ప్రమాదాలకు ప్రధాన యజమానిని (ప్రిన్సిపల్ ఎంప్లాయర్), తక్షణమే క్రిమినల్ బాధ్యునిగా చేయనంతవరకు, ఈ ప్రమాదాలు యిలాగే జరుగుతాయి. యజమానుల లాభార్జనా దాహంముందు, కార్మికుల ప్రాణాలకు విలువవుండదు.

ఇన్ని ప్రమాదాలు జరుగుతున్నా, కేవలం ఆయా ప్రమాదాలు జరిగిన సందర్భాల్లో భారీ ఎత్తున నష్టపరిహారాన్ని డిమాండ్ చేసే ఆందోళనలను తప్ప, పనిప్రదేశపు ప్రమాదాల నివారణకు పూర్తి భద్రతా చర్యలను డిమాండ్ చేస్తూ, యీ 20 సంవత్సరాల కాలంలోనూ భారత కార్మికోద్యమం చేపట్టిన ఆందోళనలు ఏమీలేవు.

స్టీల్‌ప్లాంట్ ప్రమాదానికీ, ఉద్యోగుల,కార్మికుల అనవసర మరణాలకీ కారణమైన స్టీల్‌ప్లాంట్ యాజమాన్యపు నిర్లక్ష్యవైఖరిని తీవ్రంగా ఖండిస్తూన్నాం!

పారిశ్రామిక భద్రత కోసం ఒక జాతీయస్థాయి ఉద్యమాన్ని ప్రారంభించి సాగిపోవాల్సిందిగా కార్మికోద్యమానికి విజ్ఞప్తి చేస్తున్నాం!

అధికారులు, కాంట్రాక్టు కార్మికులూ, పెర్మనెంటు ఉద్యోగులు అనే వివక్షతలేకుండా ప్రమాదంలో మరణించిన, గాయపడ్డ వారందరికీ సమానస్ధాయిలో పరిహారం, వైద్య సదుపాయాలు కల్పించాల్సింగా డిమాండ్ చేస్తున్నాం.

**14-6-2012** **రాష్ట్రకమిటి**

**సి.పి.ఐ.(ఎం-ఎల్)**



# ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు పరిణితిచెందిన ప్రజాతంత్రవాది
# కామ్రేడ్ యన్. సుబ్బారావుకు జోహార్లు

**ఏపిటిఎఫ్** నాయకులు కామ్రేడ్ యన్. సుబ్బారావు తన 81వ ఏట గుంటూరులో 30-5-2012న మరణించారు. సుబ్బారావు 1931లో గుంటూరుజిల్లా, ప్రత్తిపాడు మండలం, నిమ్మగడ్డవారి పాలెంలో జన్మించారు.

1946-48లో గుంటూరులో ఉపాధ్యాయ శిక్షణ పొంది, వెంటనే స్వంత గ్రామంలో ప్రాధమిక పాఠశాలలో ఉపాధ్యాయుడుగా చేరారు.

1947 ఏప్రిల్‌లో గుంటూరులో చెన్నపాటి లక్ష్మయ్య నాయకత్వాన రెండురోజులపాటు ఆంధ్రరాష్ట్ర ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ విద్యామహాసభలు జరిగాయి, అవి, సంస్థ ఆశయాలను రూపొందించి కర్తవ్యాలను నిర్దేశించాయి. ఈ సభల్లో యన్. సుబ్బారావు పాల్గొని సంఘ చైతన్యాన్ని పొందారు. విద్యామహాసభలకు ముందే సంఘ సభ్యత్వాన్ని స్వీకరించారు.

అధికార మార్పిడి తర్వాత కాంగ్రెసు పార్టీ ప్రభుత్వం వలస పాలకుల చట్టాలను, ఉత్తర్వులను సవరించక యథాతథంగానే అమలు చేసింది. అందువలన ఉపాధ్యాయులకు సంఘం పెట్టుకొనే హక్కులేదని, వగైరా ఆంక్షలు ఫెడరేషన్ నాయకులపైన, కార్యకర్తలపైన ప్రయోగించింది. కమ్యూనిస్టు పార్టీపైన అమలు చేసిన తీవ్ర నిర్బంధ అణచివేత విధానాలను ప్రజా సంఘాలపైన, వృత్తి సంఘాలపైన అమలుచేసింది. సింగరాజు రామకృష్ణయ్య మరికొందరికి జారీ చేసిన ఉద్యోగ ఉద్వాసన ఉత్తర్వులను మద్రాస్ హై కోర్టులలో సవాల్ చేసి, రద్దు చేయించి, సంఘ స్వాంతంత్ర్య హక్కును 1951లో సాధించింది.

టీచర్స్ ఫెడరేషన్ కమ్యూనిస్టుపార్టీ సంస్థయని, ముద్రవేసి, సామాన్య ఉపాధ్యాయులు, సంస్థ వెనుక ర్యాలీగాకుండా భయభ్రాంతులను చేసేందుకు పాలకులు, నిరంకుశాధికారవర్గం పెద్దఎత్తున ప్రచారంగావించాయి. దీనికి సమాధానంగా ఫెడరేషన్ నాయకత్వం విధానపత్రాన్ని రూపొందించి, సంస్థ లక్ష్యాలను నిర్ధేశించింది. సంస్థకు విశాలప్రాతిపదిక కల్పించి, ఉపాధ్యాయులు ఎటువంటి అభిప్రాయాలు కలిగివున్నా కలిసి పనిచేయడానికి అవకాశం కల్పించింది. ఈ విధానపత్రం 1953లో కాకినాడలో జరిగిన రాష్ట్రఫెడరేషన్ మహాసభలు ఆమోదించాయి. ఈ సభల్లో గుంటూరు తాలూకా ప్రతినిధిగా పాల్గొన్న కా॥ సుబ్బారావు, విధానపత్రాన్ని అవగాహనను ఆకళింపు చేసుకున్నారు.

వలస పాలకులు విద్యారంగంలో నెలకొల్పిన ఎయిడెడ్ విద్యాసంస్థలు ఉపాధ్యాయులను వెట్టిచాకిరీకి గురిచేశాయి. వాటిల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు ఉద్యోగ భద్రతలేదు. వేతనాల్లో విచక్షణ చూపించారు. ప్రభుత్వ ఉపాధ్యాయులతోపాటు సమానంగా ఏ సౌలభ్యం లేదు. దినదినగండంగా వారి పరిస్థితి వుండేది. అందువలన ఎయిడెడ్ పాఠశాలలను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని ఎలిమెంటరీ టీచర్స్ ఫెడరేషన్ పెద్దఎత్తున ఉద్యమాలు సాగించింది. అటు కమ్యూనిస్టుపార్టీ, ఇతర పార్టీల శాసన సభ్యుల ద్వారా ప్రభుత్వం మీద గట్టివత్తిడి తీసుకువచ్చింది. చివరకు ఎయిడెడ్ విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీన పరచుకున్నది. గుంటూరు తాలూకాలో పాఠశాలలను స్వాధీనం చేయించడంలో ఫెడరేషన్ తరపున సుబ్బారావు కృషిచేసి, జయప్రదం చేశారు. టీచర్స్ ఫెడరేషన్‌లో ప్రత్తిపాడు సమితి, గుంటూరు జిల్లాశాఖ ప్రధాన బాధ్యతలను, రాష్ట్రస్థాయిలో ఉపాధ్యక్ష బాధ్యతను స్వీకరించి, సమర్ధవంతంగా పనిచేసి, ఎన్నో ఉద్యమాలు సాగించి, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో అహర్నిశలు కృషిచేశారు.

సంస్థ లక్ష్యాల, ఆశయాల కోసం సుబ్బారావు నిబద్ధతతో నిలబడ్డారు. వివిధ సందర్భాలలో కొన్నిశక్తులు నిర్మాణ పద్ధతుల నుండి, ఆశయాల నుండి వైదొలిగి వ్యవహరించి, విచ్ఛిన్నాలకు, చీలకలకు పాల్పడినపుడు సంస్థ నిర్ణయాలను పాటించి, నిబ్బరంగా వాటిని ఎదుర్కొన్నారు. సంస్థ వెనుక ఉపాధ్యాయులను నిలబెట్టి, దాని పురోగమనానికి అవిరళ కృషి చేశారు.

ఉపాధ్యాయ ఉద్యమంలో సమరశీలంగా పనిచేసిన సుబ్బారావు దాని వరకే పరిమితం కాలేదు. సుబ్బారావు బాల్యంలో బాల సంఘానికి కార్యదర్శిగా పనిచేశారు. విద్యార్థి ఉద్యమాలలో పాల్గొన్నారు. కమ్యూనిస్టు పార్టీకి ఆనాడు ఆ ప్రాంతంలో నిమ్మగడ్డవారిపాలెం ఒక కేంద్రంగా పనిచేసింది. అందువలన వారు కమ్యూనిస్టు పార్టీకి చేరువయ్యారు. ఉపాధ్యాయ శిక్షణ పొందిన కాలంలో ఖాళీసమయంలో గుంటూరులో జిల్లా పార్టీ కార్యాలయానికి వెళ్ళి, పార్టీ అప్పగించిన పనులు చేసేవారు. పార్టీ సాహిత్యాన్ని, సిద్ధాంత గ్రంథాలను అధ్యయనం చేసేవారు. పర్యవసానంగా సుబ్బారావు ఒక కమ్యూనిస్టుగా రూపొందారు.

1948లో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాక ఆ బాధ్యతలను నిర్వహిస్తూనే మిగతా కాలంలో పార్టీ అప్పగించిన కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేవారు. ఆ గ్రామం మీద నిర్బంధ విధానం పెరగడంతో అక్కడ పార్టీ కార్యకర్తలు అజ్ఞాతవాసానికి వెళ్ళారు. సుబ్బారావు, ఆ పాఠశాల మేనేజరు పాఠశాలను మూసివేసి, 1950లో అజ్ఞాతవాసానికి వెళ్ళారు. ఈ విధంగా వెళ్ళిన వారిని కోర్టుకు హాజరు కమ్మని కమ్యూనిస్టు పార్టీ ఒకపిలుపు యిచ్చింది. సుబ్బారావు, టీచర్ మేనేజరు కూడా గుంటూరు కోర్టులో హాజరుకావడం, వాళ్ళమీద పెట్టిన కేసును ప్రముఖ న్యాయవాది ఎస్.వి.ఎల్. నరసింహం వాదించి, కొట్టివేయించారు. తిరిగి ఉద్యోగంలో 1951లో చేరారు.

తన గ్రామంలోవున్న విద్యార్థులను, యువజనులను, ప్రజలను చైతన్య పరచడంలో సుబ్బారావు వివిధ మార్గాలు అవలంబించారు. దినపత్రికలను తెప్పించి, వారికి అంద చేసేవారు. చదువురాని వారిని సమావేశపరచి, చదివి విన్పించేవారు. అలానే అభ్యుదయ సాహిత్య పుస్తకాలను తెప్పించారు. గోర్కీ అమ్మ; కొడుకులు-కూతుళ్ళు; ప్రేమచంద్, శరత్, గురజాడ, శ్రీశ్రీ వంటి రచయితల గ్రంథాలను, పార్టీ సాహిత్యం, సిద్ధాంత గ్రంథాలను అందించేవారు. **'సందేశం'** సిద్ధాంత మాసపత్రికను తెప్పించేవారు. వీటన్నిటిని అధ్యయనం చేయించి, సామాజిక ప్రజాతంత్ర చైతన్య స్థాయిని పెంచేవారు.

కమ్యూనిస్టు ఉద్యమాలలో వచ్చిన చీలికలను సుబ్బారావు లోతుగా పరిశీలించేవారు. తొలుత విప్లవ కమ్యూనిస్టుల వైపు, తరువాత సిపిఐ(ఎం-ఎల్) తో అనుబంధం పెంచుకున్నారు. పార్టీ జనరల్ బాడీలకు, అధ్యయన తరగతులకు హాజరయ్యేవారు, వీటిల్లో చెప్పే విషయాలను వివరంగా పరిశీలించి, అవసరమైన వివరణలడిగేవారు.

యువజన, విద్యార్థి, జనసాహితి సమావేశాలకు వక్తగా ఆహ్వానించినపుడు సుబ్బారావు పాల్గొని ప్రసంగించేవారు. తన జీవితానుభవాలను, జ్ఞాపకాలను క్రోడీకరించి, చెప్పి, ఉత్తేజం కల్గించేవారు. ఆనాడు తను నేర్చుకొన్న పాటలను చక్కగా పాడేవారు.

వారు కమ్యూనిస్టుగానే గాక ఒక ప్రజాతంత్రవాదిగా ఎంతోమందితో కలిసి మెలిసి వ్యవహరించి, వారికి సన్నిహితంగా వుండేవారు. నీతి నిజాయితీగా నిరాడంబరంగా నిబద్ధతతో జీవన విధానాన్ని సాగించి, కన్నుమూసిన కామ్రేడ్ సుబ్బారావుకు సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ విప్లవజోహార్లు అర్పిస్తున్నది. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నది. ✡

# కా॥ నూతలపాటి సుబ్బారావు సంతాప సభలో పలువురి ఘననివాళి

**11-6-2012న** గుంటూరు అంబేద్కర్ భవనంలో 'ఉపాధ్యాయ' పత్రిక ప్రధాన సంపాదకుడు షేక్ జిలాని అధ్యక్షతన సంతాపసభ జరిగింది. ఈ సందర్భంగా 'జనశక్తి' పత్రిక సంపాదకులు కా॥ పి. జస్వంతరావు మాట్లాడుతూ కా॥ సుబ్బారావు జీవితానుభవం అమూల్యమైనదని యువతరంలో ఉద్యమాలపట్ల భయం ఎక్కువగా ఉన్నదని, అవతలివ్యక్తి స్థాయికి చేరువై, కా॥ సుబ్బారావు వారిలో ప్రేరణ కలిగించేవారనీ ఉద్యమాలపట్ల ఉపాధ్యాయుల్ని ఆకర్షితుల్ని చేయగలిగారని అన్నారు.

ఎ.పి.ఎఫ్.టియు(న్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గుర్రం విజయకుమార్ మాట్లాడుతూ సమాజాన్ని మేల్కొల్ప డానికి ఆయనపాటుపడ్డారని , సామాజిక పరివర్తనకై కృషి చేసి ఛాందస వాదుల్ని ఎదుర్కొన్నారని పేర్కొన్నారు.

'ప్రజాసాహితి' సంపాదకులు కె. రవిబాబు ఎ.పి.టి.ఎఫ్ సభ్యుడిగా సుబ్బారావుగారితో తనకు సాన్నిహత్యంఉందని, ప్రజాసాహిత్య సభలకు హాజరయ్యే వారని, 'ప్రజాసాహితి' తరఫున జోహార్లు తెలిపారు.

ఎ.పి.టి.ఎఫ్. నాయకులు ఎన్. పరమేశ్వరరావు మాట్లాడుతూ సుబ్బారావు తొలితరం నుండి ఎపిటిఎఫ్‌కు వివిధ స్థాయిల్లో నాయకత్వ బాధ్యతలను స్వీకరించి సంఘ కార్యకలాపాలు సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. ప్రభుత్వ నిర్బంధాన్ని ఎదుర్కొన్నారన్నారు.

ఎపిటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.రఘు రామిరెడ్డి, పి. పాండురంగప్రసాద్, ఒపిడిఆర్ కార్య నిర్వాహక కార్యదర్శి వి. హనుమంతరావు తదితరులు సుబ్బారావు జీవితం ఉద్యమంతో పెనవేసుకున్నదని, చెన్నుపాటి, సింగరాజు ఆశయాలను కొనసాగించి మూడు తరాల కార్యకర్తలతో మమేకమై సంఘపటిష్టతకు పాటుపడ్డారని, విచ్ఛిన్నకారుల నుండి సంస్థను కాపాడుటకు నిరంతరం శ్రమించారని తెలిపారు. ప్రపంచీకరణ విధానాల పర్యవసానంగా సమాజంలో సంక్షోభంలో పడిందని, ఈ నాటి సామాజిక పరిస్థితులను అవగాహన చేసుకుని సామాజిక మార్పుకై కృషి చేయడమే సుబ్బారావు ఆశయాల కొనసాగింపు అవుతుందని అన్నారు.

ఉపాధ్యాయ శాసన మండలి సభ్యులు కె.యన్ లక్ష్మణరావు మాట్లాడుతూ సుబ్బారావు ఒక చరిత్ర అనీ, అనేకమంది కార్యకర్తలను తయారు చేసిన సుబ్బారావు చరిత్రలో నిలబడతారని నివాళులు అర్పించారు.

యుటిఎఫ్ మాజీ అధ్యక్షులు జోజయ్య, సీనియర్ నాయకులు రాయన్న, ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు బి. సుబ్బారెడ్డి, ఎస్.టి.యు(డి) నాయకులు సిహెచ్. జగన్నాథం, ఎపిటిఎఫ్ (1938) నాయకులు ఎ.వి. రామారావు, డిటిఎఫ్ నాయకులు ఎస్. లక్ష్మారెడ్డి, ఎపిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి. విజయసారధి, సుబ్బారావుగారి కుమార్తె సుజాత, తదితరులు సుబ్బారావు వ్యక్తిత్వం, గుణగుణాలు వారితో ఉన్న అనుబంధాన్ని వివరించి నివాళులర్పించారు. ✡

**60సంవత్సరాల...** (మొదటి పేజీ తరువాయి)

మరోవైపున మధ్యంలోనూ ముంచెత్తుతూ; ఓట్లను డబ్బులతో కొనుగోలు చేస్తూ, గ్రామీణ పెత్తందారీ, ఆధిపత్య వర్గాలు పేదలను తమ గుప్పెటలలో నుంచుకొని వేటువేయించుతూ, గ్రామీణ ఉపాధి హామీ పథక లబ్ధిదారుల కార్డులను గుంజుకొని మరీ బెదిరింపులకు గురిచేసి వేయించుకున్న ఓట్లివి!

ఈ నేపథ్యంలోనే ప్రజలు తమ చేదు నిజ జీవితానుభవాలనుండి గత ఆరు దశాబ్దాల పైగా పాలకుల దోపిడీ పాలనకు మేలిముసుగైన 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం'పై నమ్మకం కోల్పోతుండటం దోపిడీ శక్తులకు కలవరం కలిగించే విషయం. కాగా, దోపిడీ పీడనలకు వ్యతిరేకంగా, ప్రజాసంపద దోపిడీ-తరలింపులకు వ్యతిరేకంగానూ ప్రజలను సమీకరించి ఉద్యమింపజేసే కర్తవ్యాన్ని నిజాయితీగా చేబూనిన కమ్యూనిస్టు పార్టీలు ఈ పరిస్థితిని తమకనుకూలంగా మలచుకోగలగాలి. ప్రజలను పోరాటోన్ముఖుల్ని చేయాలి. ప్రజలు-తమ ఈ జీవన దుర్భర పరిస్థితి నుండి బయటపడేందుకు, తమ ఈ జీవన సంక్షోభానికి కారకులైన దోపిడీ వర్గపాలనపై సమరశంఖం పూరించటం మినహా మరో ప్రత్యామ్నాయం లేదని, మరి ఏ దగ్గరి దోవలూ లేవని బలంగా ప్రజల మధ్యకు తీసుకెళ్ళటం, పోరాటాలలోకి సమీకరించటం జరూరు కర్తవ్యం. ✡

# పశ్చిమ బెంగాల్ నగర సుందరీపేరిట కలకత్తాలోని నోనడంగా మురికివాడ విధ్వంసం - ప్రజా ఆందోళన

**కోల్‌కతా** మునిసిపల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నగర సుందరీకరణపేరిట 2012 మార్చి 30న దక్షిణ కోల్‌కత్తాలోని నోనాడంగా మురికి వాడలలో 800 ఇళ్ళను తగలబెట్టి బుల్‌డోజర్‌తో తొక్కించివేసింది. దీనిని ప్రతిఘటించిన పేదలపై లాఠీఛార్జి జరిపి, పోలీస్ వ్యానులలో కుక్కి తరలించారు. కూలిపోయిన, కాలిపోయిన తమ ఇళ్ళలో ఒకటి అరా సామానుల నేరుకొని, ప్లెక్సిబ్యానర్లతో ఆ పేదలంతా నీడను ఏర్పాటుచేసుకుని అక్కడే నివసిస్తూ ఆ మర్నాడే ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. తిరిగి ఏప్రిల్ 4న మరొక నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సదర్భంగా పోలీసులు తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించారు. తీవ్ర దుర్భాషలాడారు-ఆడవారిపై మగ పోలీసులు చేయిచేసుకున్నారు. ఈ పోలీసుల తన్నులాటలో 21సం॥ మహిళ తన గర్భాన్ని పోగొట్టుకుంది. 2½ సం॥ బాలుడికి తల పగిలిపోయింది. అయినా బాధితుల ఆందోళన కొనసాగింది. ఏప్రిల్ 8న జరిగిన బైఠాయింపునుకూడా జరగనీయకుండా పోలీసులు 67మందిని అరెస్టుచేశారు. వీరికి మద్దతుగా నిలిచిన 114 మంది విద్యార్థులను ఏప్రిల్ 9న కాలేజి స్ట్రీట్‌లో అరెస్టుచేశారు. తిరిగి ఇంకా పెద్దఎత్తున పోలీసులను మోహరించి తాత్కాలికంగా వేసుకున్న గుడిశెలను కూడా తొలగించి వేసే సన్నాహాలు చేస్తున్నారు. అనేక మందిపై తప్పుడు కేసులు బనాయిచారు. ఆయుధాలున్నాయంటూ కొందరిపై కేసులు బనాయించారు. ఈ నేపథ్యంలో మమతా బెనర్జీ నాయకత్వంలో తృణమూల్ ఆధ్యరంలో పశ్చిమబెంగాల్ సంకీర్ణప్రభుత్వ పోలీసుల నిర్బంధ చర్యలను ఖండిస్తూ వివిధ పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సామూహిక నిరాహార దీక్షలు ప్రారంభించారు.

నోనాడంగాలో ప్రజలంతా చిన్నతరహా పరిశ్రమలలోను, చిన్నపాటి ఉత్పత్తి కార్యక్రమాల్లోనూ, రోజువారీ కూలీలుగాను బ్రతుకులీడుస్తున్నవారే. కొందరు దుస్తుల పరిశ్రమలలోనూ, కొందరు అక్కడికి దగ్గరలోనే వున్న కసబా ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోనూ, మరికొందరు ఇతర చిన్నపాటి పనులు చేసేవారే. పెద్ద సంఖ్యలో కార్మికులు ఇక్కడ నుండి భవన నిర్మాణ కూలీలుగా వివిధ ప్రాంతాలకు వలసపోయి పనిచేస్తున్నారు. ఇంకా ఆటోడ్రైవర్లు, రిక్షాలాగేవాళ్ళు, ఆడవారిలో ఎక్కువ మంది ధనవంతుల ఇళ్ళలో పనులుచేస్తూ జీవనంసాగిస్తూన్నారు. వీరినందరినీ ఇక్కడనుండి తొలగించటంతో రోడ్డుప్రక్కన బండిపై 'పదిరూపాయలకు 4పుల్కా, కూర' లభించే సదుపాయం పోయింది. ముఖ్యంగా చిన్న ఆదాయ వర్గాలవారు అనివార్యంగా హోటళ్ళు, బిగ్‌బజార్లవైపు నెట్టబడ్డారు. మరోవైపున తమ ఈ కొద్దిపాటి ఆదాయాలను కోల్పోయిన పేదలు మరింత నిరుపేదలుగా మారి తమ శ్రమను కారుచౌకగా అమ్మకానికి ఉంచటానికి నెట్టబడ్డారు.

సిపిఐ (ఎం-ఎల్), పిసిసి సిపిఐ(ఎం-ఎల్), సిపిఐ(ఎం-ఎల్) జనశక్తి, సిపిఐ(ఎం-ఎల్) న్యూడెమోక్రసి, ఎంకెపి-వంటి మొత్తం వామ పక్షసంస్థలు ఐక్య కార్యాచరణగా ఏర్పడి ఏప్రిల్ 26న కోల్‌కతాలో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రజాస్వామిక ఉద్యమాలపై సాగుతున్న నిర్బంధాన్ని ఈ సందర్భంగా తీవ్రంగా నిరసించారు. నోనాడంగా మురికివాడల ప్రజానీకాన్ని అక్రమంగా నిర్బంధంగా తొలగించటాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కార్మికులు, రైతులు, విద్యార్థులు వందలాదిగా ఈ ప్రదర్శనలో పాల్గొనారు. తీవ్రమైన ఎండవేడిమిని కూడా లెక్కచేయకుండా మమత ప్రభుత్వ నిర్బంధాన్ని ప్రదర్శకులు ఎలుగెత్తి ఖండించారు. ఎస్ప్లనేడ్ ప్రాంతంలో ప్రదర్శన ముగించిన అనంతరం అక్కడే జరిగిన సభలో వివిధ పార్టీల, ప్రతినిధులు పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగించారు- వీరిలో కామ్రేడ్ సంతోష్ రాణా, అమిత భట్టాచార్య దీప్‌కార్తిక్ పాల్, పరదేశ్ సింగ్‌ఠాకుర్, సుబ్రతబసువున్నారు-సామ్రాజ్యవాద అనుకూల, బడా పెట్టుబడిదారీవర్గ మమత ప్రభుత్వ ప్రజావ్యతిరేకచర్యలకు వ్యతిరేకంగా దీర్ఘకాలం మనగలిగే ప్రజాఉద్యమ అవసరాన్ని నాయకులంతా నొక్కి చెప్పారు. సమైక్య వామపక్ష ఉద్యమ నిర్మాణానికి వారంతా పిలుపునిచ్చారు. ✡

# సిరియా: శాంతికి అవకాశం లేకుండా చేసే సామ్రాజ్యవాదుల హింసాకాండ

**సిరియా** దేశంలోని హౌలాప్రాంతంలో మే నెల 25-26లలో సాగిన మారణకాండను ప్రతిఒక్కరూ ఖండించి తీరుతారు. ఎందుకంటే 108 మంది హతులలో 49 మంది పిల్లలే. అయితే ఈ హత్యాకాండకు కారకులెవ్వరన్నదే ప్రశ్న.

### సామ్రాజ్యవాదుల ప్రచారం

సిరియా సైన్యం విచక్షణా రహితంగా హౌలా నగరంపై శతఘ్నిదాడులకు పాల్పడి ఈ మారణకాండను సాగించిందనీ, దీనికి బాధ్యత అసాద్ ప్రభుత్వానిదేనని యూరపు, అమెరికా అనుకూల పత్రికలు, టీవీలు ప్రచారం చేసాయి. అయితే ఇవి విడుదల చేసిన ఫోటోలూ, వీడియోలను పరిశీలిస్తే మృతులు శతఘ్ని దాడులకు గురికాలేదని, అతి దగ్గర నుండి సాగిన తుపాకీ కాల్పులకు కత్తిపోట్లకూ గురయ్యారనీ తేలటంతో అవి తమ కథనాన్ని మార్చాయి. ఇంతకుముందెప్పుడూ వినపడని షబ్బియా అన్న సంస్థను ముందుకు తెచ్చారు. ఇది అస్సాద్ ప్రభుత్వ అనుకూల అర్ధ సైనిక దళమనీ, ఇది చేసిన ఊచకోతే హౌలా మారణకాండ అని ప్రచారం సాగించాయి.

### రష్యా వార్తా విలేఖరుల కథనం

హౌలాలో కొంత భాగం కొన్ని వారాల నుండీ తిరుగుబాటుదారులైన ఫ్రీసిరియన్ ఆర్మీ ఆధీనంలో వుంది. సిరియా సైన్యం కొన్ని చోట్ల చెక్‌పోస్టులు పెట్టింది. ఈ చెక్ పోస్టులను ఆక్రమించేందుకు ఫ్రీసిరియన్ ఆర్మీ మే 24న దాడులు ప్రారంభించింది. 800 మంది వరకూ సాయుధులు దీనిలో పాల్గొన్నారు. వీరిలో కొందరు ఇళ్లల్లోకి దూరి కుటుంబాలను తుడిచిపెట్టారు. ఇటీవలే పంచాయితికి ఎన్నికయిన సభ్యుడి కుటుంబం కూడా వీటిలో వుంది. టాప్ న్యూస్, న్యూ ఓరియంట్ ఎక్స్‌ప్రెస్ పత్రికల విలేఖరులిద్దరి కుటుంబాలను కూడా చంపివేశారు.

### జర్మనీ పత్రిక కథనం

జర్మనీకి చెందిన ప్రసిద్ధ దినపత్రిక ఫ్రాంక్ ఫర్టర్ అల్జిమిన్ జీటుంగ్ అస్సాద్ వ్యతిరేక సున్నీ మిలిటెంట్లు హౌలా ఊచకోతను సాగించారని తెలిపింది. "హత్యకు గురైన వారందరూ అలావీ, షియా మైనారిటీ వర్గానికి చెందినవారే సున్ని నుండి షియాలోకి మారిన కుటుంబానికి చెందిన 12 మందిని చంపారు. సిరియా పార్లమెంటు సభ్యుడి ఒక షియా కుటుంబాన్ని తుడిచి పెట్టారు. ఊచకోత తర్వాత వీడియోలు తీసి సున్నిలను చంపారని ప్రచారం చేశారు" అని తెలిపింది.

### హ్యూమన్ రైట్స్ వాచ్ కథనం

'సిరియా : సాయుధ ప్రతిపక్ష గ్రూపుల హింస' అన్న నివేదికలో హ్యూమన్‌రైట్స్ వాచ్ ఇలా పేర్కొంది : సిరియాలోని ప్రతిపక్షం కిడ్నాపులు, చిత్రహింసలు, హత్యాకాండ సాగిస్తున్నది. సిరియా సైన్యమూ, ప్రభుత్వ అనుకూలురపై దాడులు సాగిస్తున్నది. దీని దాడులు షియాలు, అలావీలపై ఎక్కుపెట్టబడ్డాయి".

### ఐరాస పరిశీలకుల కథనం

ఐరాస పరిశీలకుల బృందం హౌలా ఊచకోతను ఎవరు చేశారో ఖచ్చితం చెప్పలేమనీ, అస్సాద్ ప్రభుత్వం చేసినదనటానికి ఒక్క సాక్ష్యమూ లేదనీ పత్రికలకు చెప్పింది. అయితే బృందం నాయకుడు బాన్ కి మూన్ మాత్రం అస్సాద్ ప్రభుత్వం చట్టబద్ధతను కోల్పోయిందని ప్రకటించి హిల్లరీ క్లింటన్, ఒబామాలకు వంతపాడాడు.

### అమెరికా కథనం

హిల్లరీ క్లింటన్ ఈ ఊచకోతను ఖండించింది. ప్రతిపక్షాలతో పాటు ఆల్‌ఖైదా తదితర టెర్రరిస్టులు కూడా అస్సాద్ ప్రభత్వంపై పోరాడుతున్నారని చెప్పింది. నాటో, గల్ఫ్ కో ఆపరేషన్ కౌన్సిళ్లు తిరుగుబాటు దారులకు ఆయుధాలందజేస్తున్నాయనీ, ఫ్రీసిరియన్ ఆర్మీకి సౌదీ అరేబియా, కతార్‌ల డబ్బుతో అమెరికా గూఢచారి సంస్థ ఆయుధాలు పంపుతున్నదని లెబినాన్‌లో శిక్షణ నిస్తున్నదని, అక్కడి నుండి సిరియాలో దాడులు చేస్తున్నారనీ ఒకప్పుడు అమెరికా గూఢచారిగా పనిచేసిన సిబెల్ ఎడ్మండ్ తెలిపారు. వాషింగ్‌టన్ పోస్టు పత్రిక ఈ విషయాన్ని ధృవీకరించింది.

### కోఫీ అన్నన్ పాత్ర

ఐరాస భద్రతా మండలి జూన్ 4న సమావేశమైంది. దీనికి చైనాప్రతినిధి అధ్యక్షత వహించారు. భిన్న కథనాలు వినవస్తున్నందున ఐరాస ప్రధాన కార్యదర్శి కొఫి అన్నన్ ఒక బృందాన్ని పంపి జరిగిందేమిటో తెలపాలని అధ్యక్షుడు ప్రతిపాదించగా సమావేశం ఆమోదించింది.

దీనిపై మీరేమి చర్యలు తీసుకున్నారని విలేఖరి అడిగిన ప్రశ్నకు కొఫిఅన్నన్ సమాధానం చెప్పలేదు. కాగా సాధారణ సమితి ఇన్‌ఫార్మల్ సమావేశాన్ని ఏర్పాటు చేశాడు. అమెరికా అనుకూల దేశాలన్నీ అస్సాద్ ప్రభుత్వాన్ని ఖండిస్తూ మాట్లాడగా, వెనిజులా, క్యూబా, నికరాగువాలు అభ్యంతరం తెలిపాయి. సమాచారం అసంపూర్ణంగా వున్నందున ఏకపక్ష నిర్ధారణ సరైంది కాదని వాదించాయి. సిరియా ప్రతినిధి జఫారీ, ఐరాస ఒక పరిశీలక కమీషన్‌ను నియమిస్తే అన్ని విధాలా సహకరిస్తామని ప్రకటించాడు. కొఫిఅన్నన్ ఈ దిశగా ఏ చర్యాతీసుకోలేదు.

### కుట్ర

పై వివరాలన్నీ ఒక ప్రణాళిక ప్రకారం ఘటనలు సాగాయని తెలుపుతున్నాయి. మొదటిగా అసలు లక్ష్యాలసాధనకోసం సన్నాహాలు చేయటం; తర్వాత ఊచకోత వార్తలతో ప్రపంచ ప్రజలను అప్రతిభులను చెయ్యటం తర్వాత ఎలాంటి ఆధారాలూ చూపకుండానే ఊచకోతకు కారకులంటూ ప్రచారం చెయ్యటం. తద్వారా సైనిక జోక్యానికి వ్యతిరేకత లేకుండా చేయటం. ఇదంతా పూర్తయిన తర్వాత ఆలశ్యంగా వాస్తవాలు వెలుగులోకి వచ్చినా దాని ప్రభావం లేకుండా మరో వివాదానికి తెరలేపటం.

ఇదే యుగోస్లావియాలో జరిగింది; ఇరాక్‌లో జరిగింది; లిబియాలో జరిగింది; ఇప్పుడు సిరియా పట్లా జరుగుతున్నది. సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్య దోపిడీ విధానాలనకు ఎంతటి మారణకాండకైనా అబద్ధ ప్రచారలకైనా ఎలా తెగబడతారో ఈ అనుభవాలు తెలుపుతున్నాయి.

గత ఏడాది మధ్యప్రాచ్యదేశాలలో నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రజా వెల్లువ పెలుబికింది. ప్రజా ఉద్యమాలు ట్యునిసియా, ఈజిప్టులలో అమెరికా అనుకూల నిరంకుశ పాలకులను పదవీ చ్యుతులను చేశాయి. అయినప్పటికీ, నిరంకుశపాలనపై కార్మికవర్గ పోరాటాలు సాగుతున్నప్పటికీ, వాటికి దిశా నిర్దేశం చేయగల కార్మికవర్గ పార్టీ నాయకత్వ స్థానంలో లేనందున అమెరికా సామ్రాజ్యవాదం పరిణామాలను తనకనుకూలంగా మలుచుకొనే ప్రయత్నాలలో కొంత మేరకు సఫలంకాగలిగింది. తన తైనాతీలకే అధికారం కట్టబెట్టగలిగింది. అయితే ప్రజాస్వామ్యం కోసం అక్కడ పోరాటాలు కొనసాగుతున్నాయి.

నిరంకుశ పాలనకు ప్రజావ్యతిరేక వెల్లువలో భాగంగా చిత్రించి, ఆసాకుతో తన అనుకూలురకు అన్నిరకాల మద్దతునిచ్చి లిబియాలో గడాఫీ ప్రభుత్వాన్ని కూలదోసింది. తనను వ్యతిరేకిస్తున్న సిరియా పాలకుడు అస్సాద్‌ను తొలగించడానికి ఇదే పద్ధతిని వాడుతున్నది. నిరంకుశపాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రజాస్వామ్యవాదులంటూ తన అనుకూల శక్తులతో మత విద్వేషాలను రెచ్చగొట్టి ఆయుధాలందజేస్తూ తిరుగుబాట్లు చేయించి తన సైనిక జోక్యానికి రంగాన్ని సిద్ధం చేస్తున్నది.

మధ్య ప్రాచ్యదేశాలన్నిటినీ తన నయా వలస ఆధిపత్యం క్రిందకు తెచ్చుకొనేందుకు అమెరికా సామ్రాజ్యవాదులు అనుసరిస్తున్న దుర్మార్గ విధానమిది చమురు వనరులపై ఆదిపత్యంలో ప్రపంచ ప్రజలను దోపిడీ చేసుకుని తన ఆర్థిక సంక్షోభభారాన్ని వారిపై మోపేందుకు సాగిస్తున్న యుద్ధోన్మాద చర్యయిది. ప్రగతిశీల ప్రజాస్వామిక శక్తులందరూ ముక్తకంఠంతో దీనిని ఖండించాలి. ✡

# ఝార్ఖండ్: 'సిఎన్‌టి మరియు ఎస్‌పిటి చట్టాలను బలహీనపర్చే చర్యలనూ, నిర్వాసితులను చేసే చర్యలనూ, అణచివేత చర్యలను వ్యతిరేకించండి'

**'విస్తాపన్ విరోధీ నవనిర్మాణ్ మోర్చా ఆధ్వర్యంలో రాంచీలో ఏప్రిల్ 10వ తేదీన నిర్వహించిన పోరాట సన్నాహక సభ సందర్భంగా ప్రచురించిన కరపత్రం**

**నేడు** ఝార్ఖండ్‌లో ఒక పోరాటం సాగుతున్నది. ఒకవైపు కొంతమంది సిఎన్‌టి మరియు ఎస్‌పిటి చట్టాన్ని (ఛోటా నాగపూర్-సంతాల్ పరగణా ఆదివాసీ చట్టాలు- ఇవి భూమిపై ఆదివాసుల హక్కును కాపాడేందుకంటూ చేసిన చట్టాలు-సం.) రద్దు చేసే ఆలోచనలో ఉన్నారు. వీళ్ళంతా జార్ఖండ్ ప్రజల భూముల్ని ఆక్రమించిన దొరలు. మరొకవైపు జార్ఖండ్ ప్రజలంతా ఇలాంటి చట్టాలను రక్షించుకోడానికి పోరాడతున్నారు. ఈ రెండు చట్టాలూ ప్రజల భూముల్ని రక్షించడానికి తయారు చేసినవి అయినందునే వారు పోరాడుతున్నారు. మన భూముల్ని, మన అడవుల్ని రక్షించుకోడానికి గతంలో ఎంత పెద్దఎత్తున పోరాటాలు చేశారో మనందరికీ తెలుసు. వేలాదిమంది రక్తం చిందించారు. అయినా మొత్తం అడవే మన హక్కుగా లభించలేదు. అడవిని కబ్జాకోరలనుండి రక్షించుకోడానికి ఈనాటికీ మన పోరాటం సాగుతూ ఉంది. మన భూముల్ని రక్షించుకునే సిఎన్‌టి మరియు యస్‌పిటి చట్టాలను తెల్లదొరలు తప్పనిసరి పరిస్థితిలో చేయవలసివచ్చింది. ఈ చట్టం తయారైనప్పటికీ దానిలోని లొసుగుల్ని ఉపయోగించి దాన్ని లెక్కచేయకుండా అందరికీ తెలిసే నిరంతరాయంగా సంపన్నవర్గాలు చాలా భూముల్ని ఆక్రమించగలిగారు. అటవీభూముల్ని లాగేసుకోవడం; గనుల్ని తవ్వడం; పట్టణాల విస్తరణ; నిరంతర ఆక్రమణల కారణంగా కోట్లాది ఝార్ఖండ్ వాసులు తమ భూముల నుండి, తమదైన సామాజిక జీవనం నుండి జీవన వనరుల నుండి బేదఖల్ చేయబడ్డారు.

మన ఝార్ఖండ్, మన వనరుల ఆక్రమణల నుంచి బైటపడడానికి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం చేశాం. అసంపూర్ణ రాష్ట్రం ఏర్పడింది. ఆ ఏర్పడిన రాష్ట్రంపైన కూడా పెట్టుబడిదారుల, దళారుల అధికారం సాగుతూఉంది. ఝార్ఖండ్ ప్రజలపైన అన్యాయాలు, అత్యాచారాలు ఇంతకుముందులాగానే జరుగుతున్నాయి. భూముల ఆక్రమణలు జరుగుతున్నాయి. సిఎన్‌టి మరియు ఎస్‌పిటి చట్టాలను మరింత కట్టుదిట్టమూ చేయలేదు. ఈ చట్టాల్ని గట్టిగా అమలు చేయమని ప్రభుత్వానికి హైకోర్టు కూడా ఆదేశాలిచ్చింది. అయినప్పటికీ భూముల ఆక్రమణ దారులు ఇవేవీ వినిపించుకునే దశలో లేరు. వీళ్ళే ఇప్పుడు ఈ చట్టాల్ని నాశనం చేయడానికి ఉత్సాహం చూపిస్తున్నారు. పైగా ఈ చట్టాలను అమలు చేస్తే అభివృద్ధి కుంటుపడుతుందని పాలకులు వారితో గొంతు కలుపుతున్నారు. ఈ చట్టాలేవీ అమలులో లేని 'పలాము' ప్రాంతంలో అభివృద్ధి ఎందుకు సాధించలేక పోయారని ఈ 'అభివృద్ధి ప్రేమికుల్ని' మనం ప్రశ్నించాల్సి ఉంటుంది. గడచిన 42 సం॥లలో దళితులు, పీడిత కులాలు ఈ సిఎన్‌టికి బైట రాజ్యాంగ పాలనలో ఉన్నవారు సైతం అధిక ధరలకు భూములమ్ముకుని, వారి పిల్లలు పెద్దపెద్ద ఇంజనీర్లు, డాక్టర్లు, కార్పొరేట్ వ్యవసాయదారులుగా ఎందుకు కాలేకపోయారు. బ్రిటీషు కాలం నుంచి ఇప్పటివరకు లక్షలాది మంది ఝార్ఖండ్‌వాసులు భూమి నుండి గెంటివేయబడ్డారని చరిత్ర సాక్ష్యం చెపుతున్నది. ఇందులో కొద్ది మందికి నష్టపరిహారం లభించింది. అయినప్పటికీ వారిలో ఏ ఒక్కరూ వ్యవసాయదారుడుగా మారిన వాళ్ళను మనం ఇక్కడ చూడలేము. చాలా కాలంగా రేజా, కులీ, థాంగర్, దాయీ కులాలవారందరు ప్యూన్లుగాను, రిక్షాలులాగేవాళ్ళుగానే ఎందుకు మిగిలారు? ఈ ప్రశ్నకు సమాధానం 'టాటా' వాళ్ళదగ్గరలేదు: ప్రభుత్వం దగ్గరా లేదు.

ఝార్ఖండ్ అభివృద్ధి అంటే, కేవలం కొన్ని పరిశ్రమలు, పట్టణాలు అనే అర్థంలోనే బీహార్‌లో కలిసి ఉన్నప్పటి నుంచి కొనసాగుతుంది. ప్రజల భూముల నుండి బేదఖల్ చేసి, అడవులు నరికి, ఖనిజ సంపదను దోచుకుని విదేశాలకు అమ్ముకునేవాళ్ళకోసం, పరిశ్రమలు స్థాపించుకునేందుకు అవకాశాలు కల్పిస్తున్నారు. ప్రభుత్వం సారాండా అడవిని క్రమంగా అందులో ఖనిజాల ఆదాయాన్ని దోచుకునే దోపిడీదార్ల పరం చేస్తూ వస్తుంది. అడవుల్ని పట్టపగలే నరికేస్తున్నారు. గ్రామాలలో ఉన్న బంజరు భూములన్నింటినీ స్పాంజ్ ఐరన్ పరిశ్రమలకు కట్టబెడుతున్నారు. ఇందువల్ల గ్రామాల్లోని వ్యవసాయానికి, నీటివనరులకు, మనుషులకు, పశుపక్ష్యాదులకు తీవ్రమైన నష్టం సంభవిస్తూ ఉంది. ఈ విధానాలు ఇక్కడ కొనసాగడంవల్ల గ్రామాల నుండి ప్రజలు వలస పోతున్నారు. శ్రామికుల భూములు చౌకగా మారిపోతున్నాయి. తన విధానాలను ఈ ప్రజలపై రుద్దడానికి ప్రభుత్వ అణచివేత చక్రం తిప్పుతున్నది. నక్సలైట్లతో పోరాడుతున్నామని చెప్పుకుంటూ అటవీ ప్రాంతంలో నివశించే ఆదివాసీలపై దౌర్జన్యకాండ సాగిస్తూఉంది. 6000 మందికి పైగా ఆదివాసీల్ని రకరకాల కేసుల్లో ఇరికించి జైళ్ళపాలు చేశారు.

ఇక్కడ జరిగే అభివృద్ధికి అసలైన అర్థం ఇదే కావచ్చు. ఈనాడు దేశంలో పెట్టుబడిదారీ వ్యవస్థ, దాన్ని రక్షించే ప్రభుత్వాలు గ్రామాభివృద్ధిని కోరుకోవడంలేదు. పరిశ్రమాధిపతుల, కాంట్రాక్టర్ల ద్వారా గ్రామీణ ప్రజల్ని దోపిడీ చేస్తూ, గ్రామాలకు పూర్తి వ్యతిరేక విధానాలు అమలు చేసే వీళ్ళకు గ్రామాభివృద్ధి ఉద్దేశాలు ఉండే అవకాశమేలేదు. బాండిల్ ప్రాంతంలో సుబర్ణరేఖా నదిపై ఆనకట్ట ద్వారా ఏర్పడిన విశాల జలాశయం నుంచి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా పొలాలకు నీళ్ళందించినట్లైతే వందలాది గ్రామాలకు గ్యారంటీ నీటి సౌకర్యం ఏర్పడడంతో పాటు సంవత్సరమంతా వ్యవసాయం చేసుకోవచ్చు. ఈ ప్రభుత్వం అలా చేయదు. కారణం ఈ జలాశయం పక్కనే ఉన్న 'టాటా కంపెనీ'కి ఆ నీళ్ళు అందుతుంటాయి. పొలాల్లో వేసే ఎరువులు, విత్తనాలు, మందుల వంటివన్నీ పెట్టుబడిదారుల కబంధహస్తాల్లోనే ఉన్నాయి. వ్యవసాయం చేయడం పెద్ద ఖరీదైన విషయంగా మారిపోయింది. అసలు వ్యవసాయంపై ఆధారపడి బ్రతకడమే కష్టమైపోయింది. పిల్లలకు మంచి భవిష్యత్తు కల్పించడానికి గ్రామాలలో కనీసమైన స్కూళ్ళు, కాలేజీలు కూడాలేవు; సాధారణమైన జబ్బులకు వైద్యం చేయించుకునే అవకాశాలు కూడా లేవు; సరైన దారులు, రోడ్లు కూడాలేవు; కరెంట్ లేదు; పక్కా ఇళ్ళ మాటేలేదు. ఆదివాసులకు ఋణసౌకర్యాలు లేకపోవడం; వ్యవసాయ ఉత్పత్తులకు బీమా సౌకర్యాలు లేకపోవడం; మొదలైన వ్యతిరేక పరిస్థితులలో వ్యవసాయం లాభం లేనిదిగా మారిపోయింది. ఝార్ఖండ్ నుంచి వందలాది మంది తరలిపోవడమే ఇందుకు సాక్ష్యంగా నిలుస్తుంది. గ్రామాలలో ఉన్న ప్రజలు కూడా గత్యంతరం లేని పరిస్థితులలో జీవనం కొనసాగిస్తున్నారు. ఏ జబ్బులకైతే పట్టణాలలో మంచి వైద్యం చేయించుకునే అవకాశాలున్నాయో అవే జబ్బులకు రోజూ గ్రామాలలో వందల మంది చనిపోతున్నారు. గ్రామీణ ప్రజలకు తమ భవిష్యత్తు అగమ్యగోచరంగాఉంది. తమ భవిష్యత్తు గురించిన నిరంతర అన్వేషణలో భాగంగానే ఎప్పుడు పడితే అప్పుడు పీకి మళ్ళీ వేసుకునే గుడిసెల్లో నగరవాస జీవనం సాగిస్తున్నారు. ఇక్కడి ప్రజలకు నిర్వాసితులు కావాల్సిన స్థితినీ, భూముల్ని అమ్ముకోవాల్సిన తప్పని సరి దుస్థితినీ కల్పిస్తున్నది పెట్టుబడిదారులు, రాజ్యాంగ యంత్రమే.

ఝార్ఖండ్ ప్రాంతం వ్యవసాయానికి అనువైంది కాదన్న అందమైన అబద్ధాన్ని ప్రచారంలో ఉంచు తున్నారు. అయితే ఇదే ఝార్ఖండ్‌లో 1400 మి.మీ. వర్షపాతం ప్రతీ సంవత్సరం ఉంటూ ఉంది. ఇక్కడి గ్రామాలు మంచిగా అభివృద్ధి చెందే అవకాశాలున్నాయి. ఒక వేళ ఉచిత నీటి సరఫరా నిర్వహణ చేపట్టినట్లైతే, గ్రామాలకు పై నుంచి కురింపించే వాగ్దానాలన్నీ అమలైనట్లైతే పరిస్థితి మరోలా ఉండవచ్చు. సమగ్ర గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మారిన ప్రపంచ పరిస్థితులు, ప్రజల అవసరాలకు తగ్గట్టుగా మొత్తం వ్యవసాయ, వ్యవసాయాధారిత

ఉత్పత్తుల్ని అందించే అవకాశం ఉంది. ఆహార పంటల నుండి రకరకాల ఉత్పత్తుల్ని-ఉదాహరణకు పశుపోషణ (ఆవులు, గేదెలు, మేకలు, పందులు, కోళ్ళు, బాతులు) తేనటీగల పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, చేపల పెంపకం, తోటల పెంపకాలకు ప్రభుత్వం అందించే సహకారం అందించినట్లైతే దానితోపాటుగా కుటీర పరిశ్రమలకు, చిన్నతరహా పరిశ్రమలకు అనుకూల విధానాలు అమలుపరిస్తే ఇక్కడి గ్రామాల ప్రజలకు తగినంత ఉపాధి దొరుకుతుంది. ఇప్పుడున్న అడవిలో సగానికి పైగా అడవి అని పిలవగలిగే స్థితిలోలేదు. ఈ అటవీభూముల్లో వందలాది చెరువులు, చెక్ డ్యాములు నిర్మిస్తే అటు అడవులకు, ఇటు సమీప గ్రామాలకు నీళ్ళతోపాటు భూగర్భజలాలు పెరిగి మొత్తం ఈ ప్రాంతపు మట్టిలోనే తేమ శాతం పెరిగే అవకాశం ఉంటుంది. దాంతో సంవత్సరమంతా వ్యవసాయానికి అవకాశం వుంటుంది. దీంతోపాటు ఈ అటవీ భూముల్లో మంచి ఫలవంతమైన చెట్లు పెంచవచ్చు. ఈ చెట్లద్వారానూ; చెరువుల్లోని, చెక్ డ్యాముల్లోని మత్స్య సంపదతో వందలాది సమీప గ్రామాల్లోని ప్రజల జీవితావసరాలు

(తరువాయి 7వ పేజీలో)

# ప్రపంచ వ్యాపిత ప్రజా ఆందోళనలు

## హంగేరి — నూతన రాజ్యాంగ చట్టాలకు వ్యతిరేకత

2012 జనవరి 3వ తేదీన బుడాపెస్ట్‌లోని ప్రాంతీయసభవద్ద, ఆ దేశ ప్రభుత్వం ఆమోదించిన రాజ్యాంగ నూతన చట్టాలను వ్యతిరేకిస్తూ, దీనిని ప్రజాస్వామ్యంపై దాడిగా పేర్కొంటూ వేలాదిమంది ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. రాజ్యాంగ నూతన చట్టాలు ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవేగాక, ప్రజాస్వామ్యానికి హానికరమైనవిగాకూడా వారు ఆరోపించారు. ఆ చట్టాలను రద్దుపరచవలసిందిగా ఆందోళనకారులు డిమాండ్ చేశారు.

## అమెరికా — 'సోపా' మరియు 'పీపా' బిల్లులకు వికీపిడియా నిరసలు

జనవరి 18న, ప్రపంచ ప్రఖ్యాత ఎన్‌సైక్లోపీడియా–వీకీపీడియా, ప్రాచుర్యం పొందిన ఇతర అంతర్జాల వేదికలైన వర్డ్‌ప్రెస్, రీడిఫ్‌లతో కలసి–వీనిని వినియోగిస్తున్న 40 లక్షల మంది వ్యక్తులు వీనిని మూసివేసి, ప్రతిపాదిత 'సోపా' 'పీపా' చట్టాలపట్ల తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు. ఈ రెండు చట్టాలు, వ్యాపార ప్రకటనలను నిరోధించే అధికారం కలిగివున్న ప్రభుత్వాల జోక్యాన్ని మరింత పెంచుతాయని, మేధోహక్కుల ఉల్లంఘనల పేరుతో, దూషణల పేరుతో కొన్ని ప్రసారాలను నిరోధించే అవకాశముందని వారు ప్రకటించారు.

## ఇజ్రాయిల్ — పేదప్రజల ఆవాసాల తొలగింపుకు నిరసన

గత వేసవి నుండి హతికువా పార్క్ ప్రాంతంలో షుమారు 40 వేల మంది ప్రజలు గుడారాలు వేసుకొని నివశిస్తున్నారు. టెల్–అవీవ్ నగరపాలక సంస్థ ఈ గుడారాలను తొలగించాలని నిర్ణయించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఇజ్రాయల్‌లోని టెల్ అవీవ్‌లో జనవరి 15వ తేదీన ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ప్రభుత్వమే పేదలకు గృహ నిర్మాణం చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. టెల్–అవీవ్ నగరపాలక సంస్థ ఎదుట నిరసన ధర్నా నిర్వహించిన 300 మందిలో పోలీసులు 15 మందిని అరెస్టు చేశారు.

## రుమేనియా — ప్రభుత్వ అధికారం నుండి పాలకపార్టీ తప్పుకోవాలని ఆందోళన

రుమేనియా ప్రభుత్వ పాలన నుండి అధికార పార్టీ తప్పుకోవాలని డిమాండ్ చేస్తూ ఆ దేశంలో వేలాదిమంది ప్రజానీకం బుఖారెస్ట్‌లో జనవరి 19న నిరసన ధర్నాను నిర్వహించారు. రుమేనియా ప్రభుత్వమనుసరిస్తున్న ఐఎంఎఫ్ ఆదేశిత పొదుపు చర్యలకు, సంక్షేమ పథకాలలో కోతలకు వ్యతిరేకంగా సాగుతున్న నిరసనాందోళనల కొనసాగింపుగా ఈ కార్యక్రమం చేబట్టారు. ఆందోళనకారులను నిరోధించేందుకు అమర్చిన ఇనుప కంచెలను తొలగించివేస్తూ వారు ముందుకు సాగారు. ప్రజల జీవన ప్రమాణాలను కునారిల్లచేసే విధంగా రుమేనియా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపట్ల వారు ఈ విధంగా తమ తీవ్ర ఆగ్రహాన్ని ప్రదర్శించారు.

## ఆస్ట్రేలియా — ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవానికి ఆదివాసుల నిరసన

జనవరి 26న మూలవాసుల హక్కుల పరిరక్షకులు ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవాన్ని నిరసిస్తూ ఆస్ట్రేలియా ప్రధాని జూలియాగావాండ్ మరియు ప్రతిపక్ష నేత టాంగ్ అచాట్‌లు కాన్‌బెరా రెస్టారెంట్‌లో కలసివున్న సందర్భంలో దీనిలోకి ప్రవేశించే ప్రయత్నం చేశారు. 200 మంది హక్కుల ఉద్యమ కారులు ఆ హోటల్ కిటికీలను బ్రద్దలుగొట్టి లోనికి ప్రవేశించారు. జాత్యహంకార పూరితమైన సిగ్గుచేటైన ఆస్ట్రేలియా జాతీయ దినోత్సవాన్ని వారు నిరసించారు. ఆస్ట్రేలియా మూలవాసులు తమ భూమి హక్కును గుర్తించ నిరాకరించిన ప్రభుత్వాలకు వ్యతిరేకంగా 1972లోనే తమంత తాముగా ఒక రాయబార కార్యాలయాన్ని ఏర్పరచుకున్నారు. ఆస్ట్రేలియా భూములపై ఆదేశమూలవాసుల సార్వభౌమత్వాన్ని గుర్తించే ఒప్పందంపై సంతకం చేయవలసిందిగా ఆదేశ ప్రధానమంత్రిని వారు డిమాండ్ చేస్తున్నారు.

## దేవోస్ — ప్రపంచ ఆర్థిక సదస్సు వద్ద నిరసన

జనవరి 24న, ప్రపంచ ఆర్థిక సమ్మేళనం జరుగుతున్న దేవోస్‌కు ప్రపంచ సామాజిక వేదిక కార్యకర్తలు చేరుకొని నిరసన తెలిపారు, 'పెట్టుబడిదారీ విధానం గురించి పునరాలోచించమని' ప్రెసిడెంట్‌ను వివిధ బ్యాంకులను వారు కోరారు. వేల కొలదీ నిరసనకారులు, కురుస్తున్న మంచును, తీవ్రమైన చలిని లెక్కచేయకుండా ధర్నా నిర్వహించారు. నిరసనకారులనుండి ప్రపంచ ఆర్థిక సదస్సు ప్రాంగణాన్ని పోలీసులు గట్టిగా కాపుగాశారు.

## ఆఫ్ఘనిస్థాన్ — అమెరికా సైనిక బలగాలపై ఆగ్రహజ్వాలలు

ఫిబ్రవరి 25న, వేలాది మంది ఆఫ్ఘనులు ఆగ్రహంతో ఊగిపోతూ అమెరికా సైనిక స్థావరంపై రాళ్ళు రువ్వటంతో పాటుగా ప్రవేశ గోడలపైకెక్కి లోనికి ప్రవేశించే ప్రయత్నం చేశారు. ఈ నిరసనలు 3 రోజులు సాగాయి. 14 మంది ప్రజలు ప్రాణాలు కోల్పోవటంతో పాటు ఖురాన్ తగులబెట్టిన దానికి నిరసనగా వారు ఈ కార్యక్రమం చేపట్టారు. విదేశీ సైనికులు నిరసనకారులపై జరిపిన కాల్పులలో ఇద్దరు ఆందోళనకారులు చనిపోవటంతో పాటు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు.

## మయన్మార్ — బొగ్గు ఆధార విద్యుత్ కర్మాగార ప్రతిపాదనకు నిరసన

ఫిబ్రవరి 14న, ఆకుపచ్చ చొక్కాలు ధరించిన 'గ్రీన్‌పీస్' ఉద్యమ కార్యకర్తలు మయన్మార్ సముద్రతీర పొడవునా కవాతు నిర్వహించి, 4000 మె.వా. స్థాపిత సామర్థ్యంతో బొగ్గు ఆధారిత విద్యుత్ పరిశ్రమ నిర్మాణ ప్రయత్నాలను వ్యతిరేకించారు.

ఆశ్చర్యకరంగా, ఒక నాటకీయ పరిణామంలో మంత్రిమండలి ప్రతినిధి ఒకరు ఆందోళనకారులను మర్యాదపూర్వకంగా కలుసుకొని కాలుష్యం గురించి ప్రజలు వెలిబుచ్చిన ఆందోళనల జాబితా రాసుకుని, బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రం నిర్మాణ ప్రతిపాదనలను ఉపసంహరించుకున్నట్లుగా ప్రకటించారు. బహుశా జరగనున్న ఆదేశ ఎన్నికలలో ప్రజలను లోబరుచుకునే ఉద్దేశ్యంలో ఈ చర్య చేపట్టివుండవచ్చు.

## పాలస్తీనా — ఇజ్రాయిల్‌కు వ్యతిరేకంగా భారీ ప్రజాప్రదర్శన

ఫిబ్రవరి 17న, గాజా పశ్చిమ ప్రాంతంలో వేలాది మంది పాలస్తీనీయులు–ఖాదర్ అద్నాన్‌కు మద్దతుగా, అతని అరెస్టుకు నిరసనగా ప్రదర్శన నిర్వహించారు. ఇజ్రాయిల్ సైన్యం తనను అరెస్టు చేయటాన్ని నిరసిస్తూ ఖాదర్–జైలులోనే 62 రోజులుగా నిరాహార దీక్ష సాగిస్తున్నాడు. ఇజ్రాయిల్ మానవహక్కుల పరిరక్షణ సంస్థ ఖాదర్ అద్నాన్ ఆరోగ్యపరిస్థితి ప్రమాదకరంగావుందని ప్రకటించటంతో వేలాదిగా నిరసనకారులు వీధుల్లోకి వచ్చి ఖాదర్ అద్నాన్‌ను విడుదల చేయవలసిందిగా డిమాండ్ చేశారు. అద్నాన్‌తోపాటు జైల్లోని ఇతర ఖైదీలు కూడా, అతనికి సంఘీభావంగా నిరవధిక దీక్షలో పాల్గొన్నారు.

## పాకిస్థాన్ — అమెరికా వ్యతిరేక భారీ ప్రజా ప్రదర్శన

ఫిబ్రవరి 19న, వేలాదిమంది పాకిస్తానీయులు ఇస్లామాబాద్ వీధులలోకి వచ్చి 'అమెరికాకు మరణం ఖాయం' అని నినాదాలు చేస్తూ అమెరికాకు వ్యతిరేకంగా ఒక పెద్ద ప్రజా ప్రదర్శన నిర్వహించారు. పాకిస్తాన్‌లో అమెరికా జోక్యాన్ని వారు నిరసించారు. మితవాద భావాలుగల మతసంస్థ ఈ ప్రదర్శన నిర్వహించింది. ఈ ప్రదర్శనలో 2,500 మంది పాల్గొన్నారు. ఈ సంఖ్య కొద్ది సేపటికే 3,500కు చేరుకుంది.

## పెరూ — అమెరికా అనుకూల గనుల పరిశ్రమకు వ్యతిరేకంగా ప్రదర్శన

ఫిబ్రవరి 10న, వేలాదిమంది పెరూ దేశ ప్రజలు లిమాపట్టణంలో 'నీటికొరకు మహత్తర దేశీయ ప్రదర్శన' నిర్వహించారు. పెరూ దేశానికి చెందిన బెనవెంచురా కంపెనీ, అమెరికా గనుల పరిశ్రమ దిగ్గజమైన న్యూమౌంట్‌తో కలగలిసి దేశంలోని 'కోంగా' అనే పెద్ద బంగారు, రాగి గనుల తవ్వకాలు చేపట్టటానికి నిరసనగా వారు ఈ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ అతిపెద్ద సంయుక్త తవ్వకాల ప్రాజెక్టుతో వేలాదిమంది రైతులకు, ప్రజలకు జీవనాధారమైన నదులు, చెరువులతోసహా సహజసిద్ధ నీటివనరులన్నీ కాలుష్యానికి గురవుతాయి. ఈ భయాందోళనలతోనే వేలాదిమంది పెరూ దేశ ప్రజానీకం కోంగా గనుల ప్రాజెక్టును వ్యతిరేకించే బ్యానర్లు, ప్లకార్డులను ప్రదర్శిస్తూ భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు.

## పాకిస్థాన్ — ఆఫ్ఘనిస్తాన్ 'నాటో' బలగాలకు సరఫరాల కోసం మార్గాన్ని తిరిగి తెరవటం పట్ల నిరసన

మార్చి 23న, జమాల్–ఉద్, దావా సంస్థలకు చెందిన వేలాది మంది కార్యకర్తలు ఆఫ్ఘనిస్తాన్‌లో తిష్టవేసిన నాటోబలగాలకు కావలసిన అవసరాలను సరఫరా చేసేందుకు తమ దేశంలో మార్గాన్ని తిరిగి తెరవటాన్ని నిరసిస్తూ, నినాదాలు చేస్తూ లాహోర్ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

## రష్యా — పుతిన్ విజయాన్ని నిరసిస్తూ ప్రదర్శన

రష్యాలో జరిగిన ఎన్నికలలో ఎన్నో తప్పుడు పద్ధతుల ద్వారా అధికారంలోకి వచ్చిన ప్రధాని పుతిన్‌కు వ్యతిరేకంగా రష్యాలో ఒక నూతన నిరసనల వెల్లువ సాగుతున్నది.

మార్చి 5న 'పుతిన్‌లేని రష్యా' 'పుతిన్ ఒక దొంగ' వంటి నినాదాలు చేస్తూ 20 వేలమంది నిరసనకారులు మాస్కోలో పుష్కిన్ స్క్వేర్‌లో ప్రదర్శన నిర్వహించారు.

సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో 3వేల మంది ప్రజలు ఒక అనధికార నిరసన ప్రదర్శనకోసం పోగయ్యారు. వందలాదిమందిని మాస్కోలో సెయింట్ పీటర్స్ బర్గ్‌లో నిర్బంధంలోకి తీసుకున్నారు. నోవాసిబ్రిస్క్, యెకాటిలిన్‌బర్గ్, టాయుమెన్, క్రాస్నోడార్, రాస్తోవ్ ఆన్‌డాన్, నిజ్ని నవ్‌గొరాడ్ వంటి పట్టణాలతో సహా ఎన్నో నగరాలలో నిరసన ప్రదర్శనలు జరిగాయి.

## బహ్రెయిన్ — మానవహక్కుల ఉల్లంఘనకు నిరసన

మార్చి 23న, బహ్రెయిన్‌లో ప్రజాస్వామ్య అనుకూల శక్తులపై ప్రభుత్వం సాగిస్తున్న నిర్బంధం, అణచివేతలను నిరసిస్తూ యువకులు, ప్రజాస్వామ్యవాదులు వీధులలోకి వచ్చి నిరసనలు తెలిపారు. వివిధ ప్రాంతాలలో నిర్వహించిన పది వేర్వేరు నిరసన ప్రదర్శనల్లో వేలాదిమంది ప్రజలు పాల్గొన్నారు. నిరసనకారులు పోలీసులతో ఘర్షణ పడ్డారు. పోలీసు కాల్పులలో ఇద్దరు ఆందోళనకారులు హత్యచేయబడ్డారు.

## ఇజ్రాయిల్ — యుద్ధాన్ని నిరసిస్తూ భారీ ప్రజాప్రదర్శన

మార్చి 24న, ఇజ్రాయిల్‌లో వేలాదిమంది ప్రజానీకం టెల్ ఆవీవ్‌లో భారీ ప్రదర్శనలను నిర్వహించారు. వీరంతా ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధంలో పాల్గొనవద్దని తమ దేశాన్ని ఇతర దేశాలను డిమాండ్ చేశారు. వారు 'మేము ఇరాన్‌తో యుద్ధాన్ని కోరుకోవటంలేదు' 'మేము బాంబులను కోరటంలేదు' 'మేము చర్చలను, సంప్రదింపులను మాత్రమే కోరుతున్నాం' వంటి నినాదాలు చేశారు. యుద్ధపిపాసి ఇజ్రాయిల్‌ను ఇరాన్‌తో యుద్ధానికి తలపడవద్దని వారు హెచ్చరించారు.

## ఇయు — వలసకారుల మరణాలపై ఇయు హక్కుల బృందాలు నాటోతో సంఘర్షణ

మార్చి 29న ఒక యూరోపియన్ యూనియన్ బృందం–నాటోపై పశ్చిమతీర రక్షణ బలగాన్ని విమర్శించింది. గత సం॥ లిబియాకు వ్యతిరేకంగా సాగించిన యుద్ధప్రక్రియల క్రమంలో మధ్యధరా సముద్రంలో చిక్కుకున్న వలస కార్మికులతో కూడిన ఒక పడవను రక్షించకుండా ముంచివేసిందని ఒక నివేదికలో పేర్కొంది.

వలస కార్మికుల పడవలోని 72 మందిలో 9 మంది మాత్రమే బతికి బట్టకట్టగా, మిగిలిన వారందరూ మునిగిపోయారు. వీరిని రక్షించగలిగే అవకాశముండీ నావికాబలగాల పడవలు వీరిని రక్షించలేదని అందులో పేర్కొన్నారు. ఆదేవిధంగా ఈ నివేదిక ఇటలీ, మాల్టాలను కూడా తప్పుపట్టింది. వీరికి ప్రమాదానికి గురైన పడవ గురించిన ఖచ్చితమైన సమాచారమున్నప్పటికీ అవి నిర్లక్ష్యం వహించాయని పేర్కొంది.

## చిలీ — సార్వత్రిక ఉచిత విద్యకై విద్యార్థుల సమ్మె

ప్రభుత్వానికి సలహా ఇచ్చే కమిటీ ఉచిత విద్యను నిరాకరించటంపట్ల తీవ్ర వ్యతిరేకతను వ్యక్తం చేస్తూ మార్చి 29న చిలీ విద్యార్థులంతా సమ్మెచేశారు. ఉచిత సార్వత్రిక విద్యను వారు డిమాండ్ చేశారు. చిలీలో విద్య ప్రైవేటీకరణను వారు నిరసించారు.

## అమెరికా — జాత్యహంకారాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు

ట్రేవాన్ మార్టిన్ అనే ఆఫ్రో–అమెరికన్ యువకడొకరు అకారణంగా జార్జి జిమ్మెరమాన్ అనే ఒక శ్వేతజాతి ఉద్యోగి చేతిలో హత్యకు గురైన నేపథ్యంలో, హంతకుడిని నెలరోజులవరకు అరెస్ట్ చేయని పరిస్థితుల్లో, పైగా జిమ్మెరమెన్ తన స్వీయ రక్షణ కోసమే మార్టిన్‌ను చంపవలసివచ్చిందనే వాదనలకు నిరసనగా అమెరికాలోని పలు ప్రాంతాల్లో నిరసనలు పెద్దఎత్తున సాగాయి. మార్చి 21న సమాజంలోని అన్ని సెక్షన్లకు చెందిన వారు న్యూయార్క్‌లోని యూనియన్ స్క్వేర్‌వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. మార్టిన్‌ను క్రూరంగా హత్యగావించిన జాత్యహంకార నిఘా అధికారి జార్జి జిమ్మెర్‌మన్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు.

మియామిలో 31 పాఠశాలలకు చెందిన విద్యార్థులు మార్టిన్ హత్యకు నిరసనగా పాఠశాలలను బహిష్కరించి నిరసన తెలిపారు.

## అమెరికా — జాతి వివక్షకు వ్యతిరేకంగా నిరసనలు

ఇరాక్‌కు చెందిన ఒక మహిళ హత్య సంఘటనలో జాతి వివక్షను వ్యతిరేకిస్తూ అమెరికా దేశ వ్యాపితంగా ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దక్షిణ కాలిఫోర్నియాకు చెందిన ఎల్‌మకాజోన్‌లో 32 సం॥ల ఒక ఇరాకీ కాందిశీకురాలు మార్చి 21వ తారీకున రక్తాలు చిందేలా చిత్రహింసలకు గురిచేయబడింది. ఆమెశరీరం ప్రక్కనే ఒక లేఖ విడిచివెళ్ళారు. అందులో 'నీవు ఒక తీవ్రవాదివి. మాదేశం విడిచిపో' అని పేర్కొన్నారు. ఎఫ్‌బిఐ ఈ సంఘటనపై విచారణ చేపట్టలేదు. తిరిగి మరో ఇద్దరు ముస్లిమ్ కాందిశీకులు ఇదే విధమైన హెచ్చరికలను ఎదుర్కొన్నారు. ఇతర దేశాలు, జాతులకు చెందిన వారికి అన్యాయం చేస్తూ, జాతి వివక్షను ప్రదర్శిస్తూ, మహిళాకాందిశీకులను హత్యగావించే దాన్ని నిరసిస్తూ ప్రదర్శనలు పెద్ద ఎత్తున సాగాయి. ఇరాన్ మహిళా కాందిశీకురాలి హత్యను నిరసిస్తూ మార్చి 28న ఆమె ఇంటి సమీపంలోనే ఒక ప్రదర్శన నిర్వహించారు. మార్చి 29న నార్త్ కరొలినా విశ్వవిద్యాలయప్రాంగణంలోనూ, న్యూయార్క్‌లోని క్వీన్స్‌కాలేజి ప్రాంగణంలోనూ మరియు ఇతర వివిధ కళాశాలలలోనూ నిరసన ప్రదర్శనలు భారీస్థాయిలో నిర్వహించారు.

## మలేషియా — అంతర్గత భద్రతా చట్టానికి నిరసన

ఏప్రిల్ 9న అంతర్గత భద్రతాచట్టాన్ని నిరసిస్తూ కౌలాలంపూర్‌లో వేలాది మంది ప్రజలు ప్రదర్శన నిర్వహించారు. ముందస్తుగా నిర్బంధిచే ఐ.ఎస్.ఏ చట్టాన్ని వారు నిరసించారు.

## ఇజ్రాయిల్ — జాత్యహంకార ఫుట్‌బాల్ దాడికి నిరసన

మార్చి 28న 100 మందికి పైగా యూదు కార్యకర్తలు జెరూసలెం వాణిజ్య కూడలివద్ద ఇజ్రాయిలీ అరబ్బులపై యూదుల ఫుట్‌బాల్ అభిమానులు దాడిచేయటాన్ని నిరసించారు. దాడిచేసిన యూదులు మల్హాపూల్ వద్ద అరబ్ ఉద్యోగులను నిర్బంధించి 'అరుబ్బులకు చావే'నంటూ నినదించారు.

## రష్యా — నాటోస్థావరానికి ఉల్కనోవ్‌స్కీ కమ్యూనిస్టుల నిరసన

రష్యాలోని ఉల్కనోవ్‌స్కీ సమీపంలోని నాటో రవాణాస్థావరాన్ని, ఆపట్టణంలో కమ్యూనిస్టులు నిరసిస్తూ ఏప్రిల్ 7నుండి ఉల్కనోవ్‌స్కీలో నిరాహారదీక్ష చేపట్టారు. వోల్గాపై ఆధిపత్యం వహించే నాటో ప్రయత్నాలను వారు హెచ్చరిస్తూ 'రష్యా పవిత్ర నేలపై నాటో కాలు మోపేందుకు అనుమతి నీయవద్ద'ని వారు డిమాండ్ చేశారు.

## దక్షిణ కొరియా — న్యూక్లియర్ ప్రమాదాలు లేని ప్రపంచాన్ని కోరుతూ ప్రదర్శన

మార్చి 23న ఆసియా దేశాలనుండి హాజరైన పలువురు ఆందోళనకారులు అణుపరిశ్రమ కాలుష్యాన్ని వ్యతిరేకించారు. దక్షిణకొరియాలోని అణుపరిశ్రమ సమ్మేళనం వద్దనే ఈ కార్యక్రమం చేపట్టారు.

(తరువాయి 5వ పేజీలో)

# ఉత్తరప్రదేశ్ 17వ శాసనసభ ఎన్నికలు పరిణామాల దశ-దిశ

**ఉత్తరప్రదేశ్,** పంజాబ్, ఉత్తరాఖండ్, గోవా, మణిపూర్ రాష్ట్రాల శాసనసభలకు 2012 జనవరి-మార్చిలో ఎన్నికలు జరిగాయి. వీటిలో ఉత్తరప్రదేశ్ 17వ శాసనసభకు జరిగిన ఎన్నికలు అందరినీ ఆకర్షించాయి. భారతీయుల, సామ్రాజ్యవాదుల చూపు ఉత్తరప్రదేశ్‌పైనే వుండింది. పత్రికలు, ఛానెళ్లలో పెద్ద పేరున్న రాజనీతిజ్ఞులూ, మేధావులూ ఎన్నికల విశ్లేషకులూ పరిణామాలపై తమతమ అంచనాలను ఎన్నికలకు ముందునుండే తెలుపుతూ వచ్చారు. అవినీతిపర కోటీశ్వరులూ, నేరస్థ మాఫియాల గెలుపుతథ్యమంటూ జ్యోతిష్కులూ, ధూర్త మహాత్ములూ భవిష్యవాణిని వినిపించారు. అయితే ఎవరూ కూడా ఏ ఒక్క పార్టీకో ప్రభుత్వమేర్పాటు చేయగల మెజారిటీ వస్తుందని చెప్పలేక పోయారు. ఎవరికీ మెజారిటీరాక, మిశ్రమ ప్రభుత్వ ఏర్పాటు జరుగుతుందని చెప్పారు. సమాజ్‌వాదీ పార్టీ (ఎస్‌పి) లేక బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్‌పి) నేతృత్వంలోనే ప్రభుత్వ ఏర్పాటు జరుగుతుందని స్పష్టంగా కన్పించింది. మార్చి 16వ తేదీ రాత్రి వరకూ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ కొనసాగింది. అప్పటివరకూ 224 సీట్లు వస్తాయన్న నమ్మకం ఎస్‌పికి కూడా లేదు.

**ఎన్నికల ఫలితాలు :**

403 స్థానాల్లో 224 స్థానాలు గెలుచుకున్న ఎస్‌పి అఖిలేష్ యాదవ్ సారథ్యంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. 2007లో ఎస్‌పికి 97 స్థానాలు వచ్చాయి. గత ఎన్నికల్లో బిఎస్‌పికి 206 సీట్లు వచ్చాయి. ప్రస్తుత ఎన్నికల్లో 80 స్థానాలు మాత్రమే వచ్చాయి. భాజాపాకు గత ఎన్నికల్లో 57 స్థానాలురాగా, నేడు 47 స్థానాలే వచ్చాయి. గత ఎన్నికల్లో కాంగ్రెసుకు 22 స్థానాలు రాగా నేడు 28 స్థానాలకు పెరిగాయి. రాష్ట్రీయలోక్‌దళ్‌కు 16 స్థానాలుండగా 6 స్థానాలకు తగ్గాయి. ఇతరులకు 17 స్థానాలుండగా 15 స్థానాలకు తగ్గాయి.

31.6 శాతం ఓట్లు ఎస్‌పికి రాగా, బిఎస్‌పికి 26.9 శాతం ఓట్లు వచ్చాయి. ఈ విధంగా 4.7 శాతం ఓట్లతో 144 సీట్లు ఎస్‌పికి అధికంగా వచ్చాయి. గత ఎన్నికల్లోని 97 సీట్లకంటే 127 సీట్లు ఎస్‌పి అధికంగా పొందింది. గతంలో 206 స్థానాలున్న బిఎస్‌పి బలం 80కి తగ్గింది. 4.7 శాతం ఓట్ల తేడాతో బిఎస్‌పి 126 సీట్లు కోల్పోయింది. ఓట్ల తకరారుతో మిగిలిన స్థానాలను కాంగ్రెసు, ఎస్‌పిలు పొందాయి. సామ్రాజ్యవాదుల దళారుల, బడాపెట్టుబడిదారుల ఆధీనంలోని అవినీతి పర కమీషన్ ఏజంట్ల, భూస్వాముల, పెద్ద కాంట్రాక్టర్ల ఈ వ్యవస్థను సమర్థించే మేధావులూ, మీడియా దీనినే జనతా ప్రజాస్వామిక వ్యవస్థగా చిత్రిస్తున్నారు. 69.4 శాతం ఓట్లు మాత్రమే పోలవగా మిగిలినవారు వ్యతిరేకత వ్యక్తంచేశారు. రాష్ట్రంలో మొత్తం మీద 28 నుండి 48 శాతం ఓట్లు పోలుకాలేదు. పోలయిన ఓట్లనే లెక్కచెబుతున్నారు. ఎన్నకల కమీషన్ అతిశయోక్తుల కంటే తక్కువే ఓట్లు పోలయ్యాయి. పోలింగు బూతుకు వచ్చిన వారిలో చాలామంది లిస్టులో తమపేరు, ఫోటో లేనందున ఓటు వేయకుండానే తిరిగివెళ్ళారు.

ఎన్నికల కమీషన్ ప్రదర్శించిన ప్రజాస్వామ్యమూ, బాహుబలానికీ, ధనబలానికి వ్యతిరేకంగా దాని ప్రదర్శనా శక్తిహీనమని రుజువయింది. అభ్యర్థులను తిరస్కరించగల హక్కు గురించి అది ఓటర్లకు చెప్పలేదు. పోలింగు అధికారులకూ చెప్పలేదు. ఓటింగ్ మిషిన్లలో అభ్యర్థులను నిరాకరించే మీటను పెట్టాలి. దానిని నొక్కిన వారి వివరాలను రహస్యంగా ఉంచాలి. ఇది ఎన్నికల కమీషన్ కర్తవ్యం. శాంతిపేరిట పౌరులను ఆటంకపరచటం సాగింది. కాగా ధనబలం, బాహుబలం వున్న వారికి చట్టం చుట్టంలా వ్యవహరించింది.

**ప్రస్తుత శాసనసభలో పారదర్శక ప్రజాస్వామిక ప్రతినిధులు**

17వ శాసన సభకు ఎన్నికయిన 403 శాసన సభ్యులలో 47 శాతం మందిపై నేరారోపణలున్నాయి. అంటే 186 మంది శాసన సభ్యులు నేరాలలో ముద్దాయిలుగా వున్నారు. గత 2007 శాసనసభలో 140 మంది (39 శాతం) ముద్దాయిలుగా వున్నారు. నేటి శాసనసభలో 271 మంది (67శాతం) సభ్యులు కోటీశ్వరులు. గత శాసన సభలో 124 మంది (38 శాతం) కోటీశ్వరులు. నేటి కోటీశ్వరులైన సభ్యుల సంఖ్య గతంకంటే రెట్టింపుగా వుంది.

2005 తర్వాత ఇప్పుడు ఎన్నికయిన కోటీశ్వరుల్లో నవాబ్ కాజిమ్‌అలీఖాన్‌కున్న ఆస్థి విలువ 47 కోట్ల 70 లక్షలు. తర్వాతిస్థానం సౌదాపూర్ నియోజక వర్గం నుండి ఎన్నికయిన ఎస్‌పి అభ్యర్థి సుభాష్‌ది. గత ఎన్నికల్లో ఆయన తన ఆస్థి విలువ 4 కోట్ల 70 లక్షలని ఎన్నికల కమీషన్ ముందు ప్రకటించారు. ఐదేళ్ళ తర్వాత ఆయన ఆస్థి 38 కోట్ల 32 లక్షలయింది.

**ఇదే ప్రజాస్వామ్యమా?**

రాజ్యాంగసభలో 1949 నవంబరు 29న ఉపన్యసిస్తూ బాబాసాహెబ్ డా॥ భీమ్‌రావ్ అంబేద్కర్ ఇలా అన్నారు:

"1950 జనవరి 26న రాజ్యాంగ చట్టం అమలు జరిగేనాటికి మనమొక వైరుధ్యభరిత జీవనంలోకి ప్రవేశిస్తాము. రాజకీయరంగంలో మనకి సమానత్వం లభిస్తుంది. సామాజిక, ఆర్థికరంగాల్లో అసమానత కొనసాగుతుంది. రాజకీయరంగంలో ఒక వ్యక్తికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒకే విలువ సూత్రాన్ని మనం పాటిస్తాము. కానీ సామాజిక, ఆర్థిక రంగాల్లో ఒక వ్యక్తి ఒకే విలువ అన్న సూత్రాన్ని నిరాకరిస్తాము. ఈ వైరుధ్యభరిత జీవనంలో మనమెంతకాలం జీవిస్తామో అంతకాలమూ మనం సామాజిక, ఆర్థిక సమానత్వాన్ని నిరాకరిస్తాము. దీనిని దీర్ఘకాలంపాటు నిరాకరిస్తూ వస్తే ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడవేస్తాము. మనమీ వైరుధ్యాన్ని తొలగించాలి. లేదంటే ఈ అసమానత్వానికి బలయ్యేవారు ఈ రాజ్యాంగసభ ఎంతో శ్రమకోర్చి నిర్మించిన ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేస్తారు."

అధికారమార్పిడి జరిగిన 65 ఏళ్ల తర్వాత ఒక వ్యక్తి ఒక ఓటు, ఒక వోటు ఒకే విలువ అన్న రాజకీయ ప్రజాస్వామ్యం ఎక్కడకు చేరింది? సామాజిక, ఆర్థిక ప్రగతి ఎక్కడకు చేరింది?

1947 ఆగస్టు 15 నాటికి భారత్‌లో 32 మంది కోటీశ్వరులున్నారు. వీరిలో బిర్లాకు 50 కోట్లు, టాటాకు 46 కోట్లు వున్నాయి. నేడు భారత్‌లో వీరి సంఖ్య 8200 అయింది. వీరి మొత్తం సంపద విలువ 47 లక్షల కోట్ల రూపాయలు. రెండవ వైపున 83 కోట్ల శ్రమజీవులు రోజుకు 20 రూ॥ ఆదాయంతో గడుపుతున్నారు.

ఈ రాజకీయ ప్రజాస్వామ్యాన్ని, లేక స్వాతంత్ర్యాన్ని బలహీనపరుస్తున్న రాజకీయ పార్టీలు, మీడియా, పాలకవర్గాల మేధావులు "ప్రకాశిస్తున్న భారత్", "నిర్మాణభారత్", "సర్వజన హితాయ-సర్వజన సుఖాయ" వంటి నినాదాలతో దేశ ప్రజలను దిగ్భ్రమ పరచి రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్నారు. గ్రామ పంచాయతి నుండి జిల్లా, పట్టణ పంచాయితీ సమితుల సభ్యులూ, అధ్యక్షులందరినీ ఒక వ్యక్తికి ఒక ఓటును, ఒకఓటు ఒక వెలగా దిగజార్చి, సారా, డబ్బు, వంటి ప్రలోభాలకు లోను చేస్తున్నారు. ప్రపంచీకరణ, సరళీకరణ, ప్రైవేటీకరణ, విదేశీ పెట్టుబడికి ఆహ్వానం, కాంట్రాక్టీకరణ మొదలగు విధానాలను అమలు జరపడానికి దేశ ప్రజలకు అందిన హక్కులు కాలరాయటమన్నది నేడు శాసన సభ్యులకు సర్వసాధారణమైంది.

విద్యనేర్పటం, సంఘటితమవటం, పోరాడటమన్నవి మాటలకే పరిమితమయ్యాయి. టివి ఛానెళ్లు, పత్రికల ద్వారా అంధవిశ్వాసాలను వ్యాప్తి చేస్తున్నారు. విద్యకు ప్రమాణంగా వుండాల్సిన డిగ్రీలు అంగడి సరుకయ్యాయి. పాఠశాలలూ, గుడులూ, మఠాలూ, నేరస్తబాబాలనూ, మహాత్ములనూ తయారు చేస్తున్నాయి. వీరి ద్వారా హత్యలూ, బలాత్కారాలూ, పీడనలూ సాగిస్తున్నారు. వీరి వెనుక అవినీతి సాగించే అధికారగణం విదేశీ బ్యాంకులకు నల్లధనాన్ని తరలిస్తున్నారు. సామ్రాజ్యవాదానికి (ప్రత్యేకించి అమెరికా సామ్రాజ్యవాదానికి) దళారీ బడాపెట్టుబడి దారులు, నిరంకుశాధికారులూ, భూస్వాములు సేవచేస్తున్నారు. దాని ప్రయోజనాల విధానాలనే భారత ప్రజలకు శాపంగా మార్చి అమలు చేస్తున్నారు.

కొన్ని వామపక్ష, ప్రగతిశీల శక్తులు మినహా రాజకీయ పార్టీలన్నీ అవినీతి నేరాలు, కులతత్వం, మతతత్వాలను ప్రోత్సహించటంలో నిమగ్నమైవున్నాయి. ఇవి పాలకవర్గాల చేతి పనిముట్లుగావున్నాయి. అవినీతి పరులనీ, నేరస్థులనీ, కులవాదులనీ, మతవాదులనీ ఎదుటివారిని నిందిస్తూ కాలం గడుపుతున్నాయి. అలాగే ఒకరికొకరు సహాయం చేసుకుంటూనే వున్నాయి. ఈ అర్థభూస్వామ్య, అర్థవలస వ్యవస్థను నిలిపివుంచటంలోనే తమకు మేలు జరుగుతుందని భావిస్తున్నాయి.

**కామ్రేడ్ మావో సే టుంగ్ ఇలా అన్నారు**

"ఆర్థిక విధాన కేంద్రీకృత వక్తీకరణే రాజకీయం, ఆర్థిక-రాజకీయ విధానాల కేంద్రీకృత వ్యక్తీకరణే సంస్కృతి". ఈ కోణం నుండి చూసినప్పుడు ఆర్థిక నీతికి రాజకీయ విధానం సేవచేస్తున్నది. ఆర్థిక విధానాల నుండి విడదీసి రాజకీయ-సాంస్కృతిక వ్యవస్థ పరిణామాలను చూడటం, అర్థం చేసుకోవటం ఆర్థికవాద, రాజకీయవాద ఊబిలోకి పడవేస్తుంది. మనం పరిణామాల వస్తుగత తత్వాన్ని చూసుకోలేక పోతాము. ఆ పరిణామాలను ప్రభావితం చెయ్యలేక పోతాము. ప్రజల సుఖదుఃఖాలను పోరాటాలను చరిత్ర పుటల్లో లిఖించలేము. స్వవచన వ్యాఘాతులంగా మిగిలిపోతాము.

బాబాసాహెబ్ డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేసిన పై ఉపన్యాసం చివరిలో ఇలా అన్నారు:

"ఈ దళిత వర్గాలు పాలితులుగా ఉండటంపట్ల విసిగిపోయి వున్నారు. వారు స్వయం పాలనను కోరుకుంటున్నారు. దళిత వర్గాల ఈ స్వావలంబనా ఆకాంక్ష వర్గపోరాటం లేదా వర్గయుద్ధం వైపు మళ్లటాన్ని జరగనివ్వరాదు. అలాంటి రోజు ఈ సభకు ప్రశస్థినివ్వదు. దుర్దినంగా వుంటుంది"... తన ఉపన్యాసం చివరిలో "ప్రజలతో నిర్మించిన ఈ ప్రభుత్వంతో వారు విసుగు చెందారు. అలాంటి ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమను కున్నప్పటికీ, లేదా ప్రజలతో నిర్మితమైనప్పటికీ ఉదాసీనంగా ఉండిపోయింది. వారు కోరుకుంటే ప్రజలదిగా వుండవచ్చు". ఆయన ఉపన్యాసానికి నేను వ్యాఖ్యానం యివ్వటం లేదు. కానీ అలాంటి వారి జయంతులు, వర్థంతుల సందర్భంగా చేసే భజనలు దైవ పండుగల పూజల స్థాయికి చేరుతున్నాయి. వర్గపోరాటం వల్ల ఏ సభ నష్ట పోతుందో వారి నుండి తెలుసుకోగోరుతున్నాను. ఎవరు నష్టపోతారు? పాలితులుగా మిగిలి పోవటంతో విసిగి పోయిన వారా? గుడిసెల కప్పుకూడా లేకుండా పోయినవారా? ప్రజలద్వారా నిర్మితమైన ప్రభుత్వ ఉదాసీనత ఎవరిపట్ల?

'ప్రపంచ కార్మికులారా ఏకంకండి!' "85 అంటే 15", 'బహుజన హితాయ-బహుజన సుఖాయ, సర్వజన్ హితాయ-సర్వజన్ సుఖాయ', "తిలకం, త్రాసు, కరవాలం వీటిని చెప్పుతో కొట్టండి!" "ఏనుగుతో నడవటమంటే గణేశునితో కాదు. బ్రహ్మ విష్ణు మహేశ్వరులతో"-మొదలగు నినాదాలిస్తున్నవారు అది (పశ్చిమబెంగాల్, కేరళ, త్రిపుర, బీహార్, జార్ఖండ్, తమిళనాడు లేదా ఉత్తర ప్రదేశ్) ఏ రాష్ట్రమైనా కానివ్వండి కార్మికులు, రైతాంగం, దళితులు, ఆదివాసులు, వెనుకబడిన వర్గాల ప్రతినిధులమని చెప్పుకుంటున్నారు. కానీ, సామ్రాజ్యవాదులు, భూస్వాములు, దళారీ బూర్జువాలు, అవినీతిమయ నిరంకుశాధికారులకు సేవ చేస్తున్నారు. ప్రపంచీకరణ, విదేశీ పెట్టుబడి, సరళీకరణ, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకత లేకుండా పోయింది. కార్మికుల, రైతాంగపు పోరాటాలు మాత్రమే వీటికి వ్యతిరేకంగా నిలుస్తాయి.

వర్గ అణచివేత, పీడనలపై ఆధారపడ్డ పాలనాధికారానికి వ్యతిరేకంగా ప్రజలచేత, ప్రజల కొరకు, ప్రజల యొక్క నూతన ప్రజాస్వామ్యాన్ని వర్గ పోరాటంపై ఆధారపడ్డ ప్రజా ఉద్యమం మాత్రమే స్థాపించగలదు.

బ్రిటీషు సామ్రాజ్య వాదులు అమలు చేసిన 1935 చట్టం, ఆ తర్వాత అధికార మార్పిడి నుండి భారత రాజ్యాంగ చట్టం అమలైన 62 ఏళ్ల తర్వాత సామ్రాజ్యవాదులు, భూస్వాములు, నిరంకుశాధికారాల పాలన సాగుతున్నదని అనుభవం స్పష్టం చేసింది. ఈ రాజ్యం (పోలీసులు, సైన్యం, న్యాయస్థానాలు) అవినీతి పరులు, కమీషన్ ఏజంట్లతో నిండిపోయింది. యుపిఏ, లేక ఎన్‌డిఏలకు (నేతృత్వం వహిస్తున్న కాంగ్రెసు, బిజెపిలు) లోపలా బయటా వున్న ప్రాంతీయ రాజకీయ పార్టీలుకూడా దేశ, విదేశీ బడాబూర్జువాలకూ, భూస్వామ్య వర్గాలకూ దళారులుగా వుంటున్నారు. సమాచార ప్రచారమంతా వీరి గుప్పెటలోనే వుంది. ఒకవైపు దోపిడీ చేసుకోవటంలో ఒకరికొకరు సాయం చేసుకుంటూనే, పైకి విమర్శలు చేసుకుంటారు. ప్రభుత్వం మారటంలో ప్రజల భరించలేని కష్టాలు తగ్గిపోవు; పైగా మరింత పెరుగుతాయి. ఎస్‌పి పాలనలో జరగబోయేదిదే. ఇలాంటి ప్రజాస్వామ్యంలో భాగస్వాములం కావాలంటూ వెళుతున్న దళితులూ పీడితులూ మోసపోక తప్పదు. విస్తృత వర్గపోరాటాన్ని వదిలి అధికారపోరులోకి తీసుకుపోతున్న వారు మార్క్సిజం - లెనినిజం - మావో ఆలోచనా విధానానికి పేదలను దూరంగా తీసుకువెళుతున్నారు.

కుల, వర్గ, లింగ ఆధారిత దోపిడీ పీడనలు, వివక్షతలకు వ్యతిరేకంగా విస్తృత వర్గపోరాటమే ప్రత్యామ్యాయం. కార్మికులు, రైతాంగం, మహిళలు, నిరుద్యోగులు, యువకులు, దళితులు, ఆదివాసులు, చిన్న పరిశ్రమదారులు, పర్యావరణ సమస్యలు దీనిలో భాగం కావాలి.

కులతత్వం, మతతత్వం, అవినీతి, హత్యలు, బలాత్కారాలూ, సామ్రాజ్యవాద దోపిడీలకు వ్యతిరేకంగా, ప్రజాస్వామిక హక్కుల రక్షణ కొరకూ, సంయుక్త పోరాటాలు అవశ్యకత నేడుంది. ప్రగతిశీల, వామపక్ష, విప్లవకర శక్తులకు విజ్ఞప్తి చేస్తున్నాము. ముందుకు రండి! మన ఆలోచనలను కలబోసుకుందాం, తర్కిద్దాం, విమర్శించుకుందాం. సమైక్య పోరాటానికి ముందడుగు వేద్దాం. ★

# పశ్చిమబెంగాల్ నగ్జల్బరి దినాన్ని పాటించిన సిపిఐ(ఎం-ఎల్)

నగ్జల్బరీ రైతాంగ ఉద్యమం పెల్లుబికిన మే24వ తేది నగ్జల్బరీ దినంగా పాటిస్తూ ప్రదర్శనలు, ఇతర ప్రచారకార్యక్రమాలను నిర్వహించమని పశ్చిమబెంగాల్ సిపిఐ(ఎం-ఎల్) కమిటి పిలుపునిచ్చింది.

ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పార్టీ డార్జిలింగ్ జిల్లా కమిటి, నగ్జల్బరి బస్టాండ్ ప్రాంతంలో ఒక బహిరంగసభను నిర్వహించింది. పరిసర ప్రాంతాలనుండి టీతోట కార్మికులు, రైతులు ఈ సభకు హాజరయ్యారు. నగ్జల్బరి ఉద్యమంలో మే25న పోలీసుకాల్పులలో మరణించిన ముఖ్యంగా తొమ్మిదిమంది రైతు మహిళలు, ఇద్దరు పిల్లలతోసహా అమరులైన వారికి సభా ప్రారంభంలోనే ఘననివాళులర్పించారు.

సభకుహాజరైన ప్రజలనుద్దేశించి సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర కార్యదర్శి కా॥ సుబ్రత బసు ప్రసంగిస్తూ దశాబ్దాల అనంతరం కూడా నగ్జల్బరి ఉద్యమ ప్రాధాన్యత ప్రాసంగీకతను సుదీర్ఘంగా వివరించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ మన ఆర్థిక వ్యవస్థపై దేశంలో చావుదెబ్బ తీయటమేకాక, మన ప్రజల జీవితం, జీవనాలపై విధ్వంసకర ప్రభావాలను కలిగించిందన్నారు. రోజులు గడుస్తున్న కొలదీ ప్రజలపై ముఖ్యంగా అమెరికా సామ్రాజ్యవాదంతో కుమ్మక్కైన పాలకవర్గాల దోపిడీ, పీడనలు అధికమవుతున్నాయన్నారు.

మహత్తర నగ్జల్బరి రైతాంగ ప్రజాఉద్యమ పంథాను అనుసరించటంద్వారానే ఫ్యూడల్ వ్యతిరేక, సామ్రాజ్య వాద వ్యతిరేక దృక్పథంతో విప్లవ ప్రజాఉద్యమాన్ని అభివృద్ధి చేయగలగటం సాధ్యమవుతుందన్నారు.

ఈ విధమైన విప్లవప్రజాఉద్యమానికి నాయకత్వం వహించేందుకు నిజాయితీగల కమ్యూనిస్టు పార్టీ ఎంతైనా అవసరమన్నారు. మార్క్సినిజం-లెనినిజం-మావో ఆలోచను విధాన బ్యానర్‌పై కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యతను సాధించాల్సిన అవసరాన్ని భౌతికపరిస్థితులు డిమాండ్ చేస్తూన్నాయన్నారు. కమ్యూనిస్టు విప్లవకారుల ఐక్యత సూత్రబద్ధమైనదిగా వుండాలి తప్ప ఎత్తుగడలతో కూడుకున్నదిగా ఉండరాదని ఈ అంశంపై గత అనుభవాలు నొక్కిచెపుతున్నాయన్నారు.

పార్టీ రాష్ట్రకమిటి సభ్యుడు కా॥ రామ్ గణేష్ బారికే, రాష్ట్రనాయకుడు కా॥ ప్రదీప్ దేవనాధ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఈ సభకు డార్జలింగ్ జిల్లాకమిటి కార్యదర్శి కా॥ జోగేన్ విశ్మకర్మాకర్ అధ్యక్షత వహించారు. ★

## ప్రపంచ ... (4వ పేజీ నుండి)

### టర్కీ: హిట్లర్ షాంపూ వ్యాపార ప్రకటనను నిరసిస్తూ ప్రదర్శన

టర్కీ దేశపు ఒక షాంపూ వ్యాపార ప్రకటనలో హిట్లర్ వేషధారి మాట్లాడుతూ 'మీరు మహిళల దుస్తులు ధరిస్తున్నట్లయితే, మహిళలు వాడే షాంపూ కూడా మీరు వాడరాద'ంటాడు. టర్కీలోని యాదు కమ్యూనిస్టులు దీనిపై అభ్యంతరం వ్యక్తం చేశారు. యూదులను ఊచకోత కోసిన హిట్లర్‌ను వ్యాపార ప్రకటనలో ఉపయోగించి తమను అవమానించటాన్ని వ్యతిరేకించారు. మార్చి 23న యాదులైన వాణిజ్య ప్రకటనకు వ్యతిరేకంగానూ, వాణిజ్య ప్రకటన యాజమాన్యం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

### ఇజ్రాయిల్: దక్షిణ సూడాన్ కాందిశీకుల సమస్యపై ఆందోళన

మార్చి 17న, వందలాదిమంది దక్షిణసూడాన్ కాందిశీకులు 'దక్షిణ సూడాన్ చాలా ప్రమాదకరమైంద'నే బ్యానర్లను చేబూని టెల్ అవీల్‌లో ఒక నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఏప్రిల్ నాటికి వారిని తిరిగి తమదేశం పంపాలనే నిర్ణయాన్ని వారు వ్యతిరేకిస్తూ, మరికొంత గడువు కావాలన్నారు. దక్షిణసూడాన్ కాందిశీకుల ఇజ్రాయిలీ మద్దతుదార్లు కూడా ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

### గ్రీస్: వలస కార్మికులకు ప్రత్యేక నిర్బంధ శిబిరాలపట్ల కమ్యూనిస్టు పార్టీ వ్యతిరేకత

ఇతర దేశాల నుండి వలసవచ్చే వారికి 30 నిర్బంధ శిబిరాల ఏర్పాటుకు ప్రయత్నాలను, ప్రతిపాదనలను గ్రీస్ కమ్యూనిస్టుపార్టీ వ్యతిరేకించింది. 'నాటో' ప్రమాణాలకనుగుణంగా, ప్రైవేటు రక్షణ సిబ్బంది నియంత్రణలో వీటి ఏర్పాటు సాగటాన్ని కమ్యూనిస్టు పార్టీ నిరసించింది. ఈ శిబిరాలు జైళ్ళు మినహా మరేమీ కాదని, వీటిలో వలస కార్మికులను జీవితకాలం ఉంచేందుకే ఈ ప్రయత్నాలని తెలిపింది. ఈ విధమైన ప్రభుత్వ చర్యలకు నిరసనగా కమ్యూనిస్టు పార్టీ భారీ ప్రజాప్రదర్శనలను నిర్వహించింది. ★

# రైతులకు విత్తనాలు అందించని పాలకులు

**రాష్ట్రంలో** ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. సేద్యంలో విత్తనం కీలక పాత్ర వహిస్తుంది. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందినపుడే మంచిదిగుబడులు సాధ్యమౌతాయి. 65 సంవత్సరాల 'స్వతంత్ర' భారతావనిలో రైతాంగానికి కావాల్సినన్ని మేలు రకమైన విత్తనాలు అందించటంలో పాలకులు విఫలమౌతూ వస్తున్నారు. ఫలితంగా ప్రతి వ్యవసాయ సీజన్‌లోనూ రైతాంగానికి విత్తనాలు అందక అందోళనకు దిగాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. ప్రతి సంవత్సరం వ్యవసాయ సీజన్‌కి ముందు రైతులకు కావాల్సిన అన్నిరకాల విత్తనాలను అందుబాటులో ఉంచామని, విత్తన కొరత లేదని ప్రభుత్వాలు చెబుతూనే ఉన్నాయి. ఆచరణలో మాత్రం విఫలమౌతున్నాయి. దీంతో నాసిరకం విత్తనాలు మార్కెట్‌ని ముంచెత్తుతున్నాయి. రైతాంగానికి విత్తనాలు అందించవలసిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ, మార్క్‌ఫెడ్‌లు, తమ బాధ్యతల నిర్వహణలో విఫలమౌతున్నాయి. ప్రతి సంవత్సరం ప్రభుత్వం వివిధ విత్తనాల అవసరాల గురించి అంచనా వేయటం తప్ప వాటి సేకరణకు నిర్దిష్ట చర్యలు తీసుకోవటంలేదు.

సబ్సిడీపై మంచి విత్తనాలను రైతులకు అందిస్తామని చెప్పే పాలకులు ఇస్తామన్న సబ్సిడీ విత్తనాలను ఏ సంవత్సరం పూర్తిగా ఇవ్వలేదు. ఇచ్చే సబ్సిడీని కూడా తగ్గించివేస్తున్నారు. 2012 ఖరీఫ్ సీజన్‌లో 13.82 లక్షల క్వింటాళ్ళ వివిధ రకాల విత్తనాలను సబ్సిడీ రూపంలో రైతులకు అందచేస్తానని చెప్పిన ప్రభుత్వం ఆచరణలో విఫలమైంది. జూన్ ఒకటవ తేదీ వరకు ప్రభుత్వ సంస్థలు సేకరించిన విత్తనాలు 4.93 లక్షల క్వింటాళ్ళు కాగా, పంపిణీ చేసింది 11 వేల క్వింటాళ్ళు మాత్రమే. ప్రభుత్వం ప్రకటించిన వివిధ రకాల విత్తన సేకరణ లక్ష్యం, సేకరించినది, పంపిణీ చేసిందీ ఈ క్రింది పట్టిక తెలియచేస్తుంది. ప్రభుత్వ వైఫల్యం బట్టబయలౌతుంది.

### విత్తన కొరతకు కారణాలు

రాష్ట్రంలో పలు విత్తన కంపెనీల రాష్ట్ర అవసరాలకు మించి ఉత్పత్తి చేసి ఎగుమతి చేస్తున్నా రైతాంగానికి విత్తన సేకరణ సమస్యగానే మారింది. రాష్ట్రంలో కోటీ,

**సబ్సిడీ విత్తనాల సేకరణ (లక్షల క్వింటాళ్ళలో)**

| పంట | లక్ష్యం | సేకరించింది | పంపిణీచేసింది |
|---|---|---|---|
| వేరుశనగ | 8.00 | 2.86 | 0.009 |
| సోయాచిక్కుడు | 1.20 | 0.58 | - |
| వరి(ఎస్‌ఫ్‌ఎస్‌ఎం) | 2.36 | 0.89 | 0.007 |
| కందులు | 0.30 | 1.11 | 0.096 |
| పెసలు | 0.10 | 0.02 | - |
| మినుములు | 0.10 | 0.02 | - |
| జొన్నలు | 0.10 | 0.02 | - |
| మొక్కజొన్న | 0.50 | - | - |
| రాగులు | 0.01 | - | - |
| సజ్జలు | 0.02 | - | - |
| నువ్వులు | 0.05 | - | - |
| ఆముదాలు | 0.10 | - | - |
| జీలుక | 0.50 | 0.15 | 1.060 |
| జనుము | 0.25 | 0.13 | 0.017 |
| పిల్లిపెసర | 0.17 | 0.09 | 0.016 |
| మొత్తం | 13.82 | 4.93 | 0.110 |

9 లక్షల పత్తివిత్తన ప్యాకెట్లు అవసరంకాగా కోటీ 250 లక్షల ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని వ్యవసాయ శాఖ చెబుతున్నా పత్తివిత్తనాల కోసం రైతాంగం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గిరాకీఉన్న కంపెనీల విత్తనాలన్నీ అధికరేటు పెట్టి నల్లబజారులో రైతులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. కర్నూలు జిల్లాకు ఈ సీజన్‌లో 3 లక్షల పత్తి విత్తన సంచులు అవసరం కాగా 10వేల సంచులను మాత్రమే జూన్ 1 నాటికి కేటాయించింది. కడప జిల్లాలో 1.71 లక్షల క్వింటాళ్ళ వేరుశనగ విత్తనాలు అవసరంకాగా, 26 వేల క్వింటాళ్ళను మాత్రమే వ్యవసాయశాఖ జిల్లాకు అందచేసింది. విజయనగరం జిల్లాలో రైతాంగానికి రాయితీపై అందవలసిన వేరుశనగ విత్తనాలు నూనెమిల్లులకు తరలిపోతున్నాయి. వరి, వేరుశనగ విత్తనాలను రైతులకు అందించవలసిన రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ వాటిని సేకరించటంలోనూ, ఉత్పత్తి చేయటంలో సరైన విధానాలు అనుసరించకపోవటం వలన రైతుల ప్రయోజనాలకు నష్టం జరుగుతున్నది. గ్రామాల్లోని మోతుబరిరైతుల నుండి విత్తనాలు కొనుగోలు చేసి, నామమాత్రంగా శుద్ధి చేసి నాణ్యమైన విత్తనాల పేరుతో రైతులకు ఇవ్వటం వలన రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారు. నాసిరకమైన విత్తనాలు సరఫరా చేసినందుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు వ్యతిరేకంగా రైతాగం చేసిన ఆందోళన ఇందుకు నిదర్శనం.

1988 సం॥ వరకు రాష్ట్రంలో విత్తనాల సమస్యను ఇంతగా ఎదుర్కోలేదు. విత్తన సేకరణకు రైతాంగానికి పూర్తి హక్కు ఉండేది. తాను పండించిన పంట నుండే తిరిగి విత్తనాన్ని కట్టుకొనేవాడు. ఆ విత్తనాలను సేద్యంలో వినియోగించటమే కాకుండా తోటి రైతులకు కూడా యిచ్చేవారు. ఈ విధంగా పరస్పరం రైతులు సహకరించుకొనేవారు. అధిక దిగుబడుల పేరుతో వచ్చిన హైబ్రీడ్ విత్తనాల పంటనుండి కూడా చాలాకాలం రైతులు విత్తనాలు సమకూర్చుకున్నాడు. ఈ విధానం అమలు జరిగినంతకాలం రైతాంగానికి విత్తన కొరత అంటూ ఉండక పోవటమే కాకుండా, విత్తన ఖర్చుకూడా ఉండేదికాదు. ప్రపంచ వాణిజ్య ఒప్పందం, వ్యవసాయక ఒప్పందం అమలులోకి రావటం, విత్తనాలపై పేటెంట్ హక్కులు కల్పించటం, బహుళజాతి సంస్థల జన్యుమార్పిడి విత్తనాలు వాడకంలోకి రావటం, ఈ సంస్థలు, వారు తయారు చేసే విత్తనాల గురించి మీడియాలో ఆకర్షణీయమైన ప్రచారం చేయటం జరిగింది. దీంతో రైతులు ప్రతి సంవత్సరం విత్తనాలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. బి.టి. విత్తనాల పంట నుండి తిరిగి విత్తనం మొలకెత్తకుండా చేశారు. పంట నుండి విత్తనాలు కట్టుకునేందుకు ప్రయత్నిస్తే వారిపై కేసులు బనాయిస్తున్నారు. వీటి నుండి బయటపడటం రైతాంగానికి తీవ్ర సమస్యగా పరిణమిస్తున్నది.

విత్తన రంగంపై బహుళజాతి సంస్థల గుత్తాధిపత్యం కొనసాగుతుండటంతో భారత దేశంలో వాటి వ్యాపారం అడ్డు, అదుపు లేకుండా విచ్చల విడిగా కొనసాగుతున్నది. భారతదేశంలో విత్తన వ్యాపారం 55000 కోంట్ల రూ॥లు ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ విత్తన వ్యాపారంలో ప్రతి సంవత్సరం 5 శాతం పెరుగుదల ఉంటే, భారతదేశంలో మాత్రం 12% పెరుగుదల ఉంది. ప్రపంచ విత్తన వ్యాపారంలో 6వ స్థానంలో భారతదేశం ఉంది. ప్రపంచంలో వినియోగిస్తున్న విత్తనాల్లో 68% బహుళజాతి కంపెనీల విత్తనాలే. మనరాష్ట్రంలో 95 శాతం హైబ్రీడ్ విత్తనాలు, 100 శాతం పత్తివిత్తనాలు బహుళజాతి సంస్థల విత్తనాలే ఉన్నాయి. దేశంలో జరుగుతున్న విత్తన వ్యాపారంలో 80% ప్రైవేటు రంగానిదే.

మోన్‌శాంటోలాంటి బహుళజాతి సంస్థల విత్తనాలపై పేటేంట్ హక్కు ద్వారా టెక్నాలజీ అందించినందుకు అనేక విత్తన తయారీ సంస్థల నుండి ప్రతి సంవత్సరం వేలాదికోట్ల రూపాయలను రాయల్టీ క్రింద వసూలు చేస్తున్నది. బి.టి. పత్తివిత్తనాల వలన అధిక దిగుబడులు రాలేదని పురుగు నివారణ జరగలేదనే వాస్తవం వెల్లడైనా గత్యంతరం లేని పరిస్థితుల్లో, రైతాంగం వాటినే సేద్యంలో ఉపయోగిస్తున్నారు. బి.టి. పత్తివిత్తన ధరలు తగ్గించామని ప్రచారం చేసుకొన్న ప్రభుత్వం, మోనోశాంటో వత్తిడికి లొంగిన రాష్ట్ర ప్రభుత్వం బి.టి.1 ప్యాకెట్ రేటుని 650 నుండి 850 రూ., బి.టి.2 రేటును 750 నుండి 950 రూ. పెంచింది. ఇంకా వాటి ధరలు పెరగనున్నాయి. బి.టి. పత్తి విత్తనాల కుత్రిమ కొరత సృష్టించి చీకటి వ్యాపారంలో ప్రభుత్వం నిర్ణయించిన రేటుకన్నా ఎక్కువగా అమ్ముతున్నారు. ఖమ్మం, గుంటూరు, కర్నూలు, వరంగల్, అదిలాబాద్ జిల్లాలు విత్తనాల నల్లబజారుకు ముఖ్య కేంద్రాలుగా ఉన్నాయి.

వ్యవసాయ రంగం పైన, విత్తనరంగంపైనా సామ్రాజ్యవాదుల, వారి బహుళజాతి సంస్థల ఆధిపత్యం కొనసాగినంతకాలం దేశం-రాష్ట్రంలో విత్తన సమస్య కొనసాగుతూనే ఉంటుంది. ఈ ఆధిపత్యం తొలగించాలంటే, బహుళజాతి సంస్థల విత్తన విక్రయాలపై ఆంక్షలు విధించాలి. దేశీయ వాతావరణానికి అనుగుణ్యమైన స్వదేశీయ వంగడాలను అభివృద్ధి చేసి రైతుకు అందించాలి. పంటనుండే విత్తనం కట్టుకొనే హక్కును రైతులకు కల్పించాలి. ఇవి అమలు జరగాలంటే రైతాంగం సంఘటిత ఉద్యమం చేపట్టాలి. ✡

# భారతదేశంలో ప్రజా ఆందోళనలు

**బలవంతంగా** తమను తొలగించటాన్ని నిరసిస్తూ ఆగ్రహించిన మురికివాడల ప్రజానీకం జనవరి 9న విశాఖపట్నం నగరపాలక సంస్థ కార్యాలయాన్ని ముట్టడించారు. పోలీసులు వీరిపై తీవ్రంగా లాఠీఛార్జికి పాల్పడ్డారు.

జనవరి 10న కున్నతునాడు, వడెవర్కోడ్-పుంథ్‌క్రుజ్ పంచాయితీలకు చెందిన వందలాది మంది కేరళ హైకోర్టు వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఎర్నాకులం జిల్లా వ్యాపితంగా సేకరించిన సెప్టిక్ ట్యాంకుల మురుగునంతా బ్రహ్మపురం వద్ద పారబోయటాన్ని వారు తీవ్రంగా నిరసించారు. 'మాలిన్య నిక్షేప విరుద్ధ సమర సమితి' ఈ నిరసనను నిర్వహించింది.

జనవరి 17న ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో 550 చేపల పడవలకు చెందిన జాలరులు చేపలు పట్టకుండా శెలవు ప్రకటించారు. కాకినాడ సమీపంలో తీర ప్రాంతంలో అనేక చమురు వెలికితీత పరిశ్రమల కార్యకలాపాల ఫలితంగా తమ జీవనోపాధి దెబ్బ తింటున్నదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కంపెనీల చమురు వెలికితీత కార్యకలాపాల ఫలితంగా నష్టపోయిన మేర మత్స్యకారులందరికీ నష్టపరిహారం చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

జనవరి 24న ఖమ్మంజిల్లా, గార్ల మండలం గోపాలపురం గ్రామంలో ఆందోళనకు దిగిన రైతులు తహసిల్‌దారు కార్యాలయ అధికారులను ఘెరావ్ చేశారు. తమకు ప్రకటించిన విధంగా ఒక సం॥ క్రితం సంభవించిన తుపాను కారణంగా జరిగిన పంట నష్టం తాలూకా పరిహారం ఇవ్వకపోవటాన్ని వీరు నిరసించారు.

ఫిబ్రవరి 1న విశాఖపట్నం వద్ద హిందూజా నేషనల్ పవర్ కంపెనీ లిమిటెడ్ నిర్మాణం కారణంగా భూములు కోల్పోయే రైతులంతా 1040 మె.వా.స్థాపితసామర్థ్యంతో సాగుతున్న ఈ కంపెనీ నిర్మాణ పనులను అడ్డగించారు. వీరు విస్థాపనకు గురైన వారికి ఉద్యోగాల కల్పన గురించి డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 13న ఖమ్మంజిల్లా-టేకులపల్లి మండలం లోని కొత్తగూడెం-ఇల్లెందు ప్రధాన రహదారిని వందలాది ప్రజలు దిగ్బంధించారు. సింగరేణి కాలరీస్ కంపెనీ అధికారులు బొగ్గును తరలించే సందర్భంలో సంభవించే కాలష్యాన్ని నియంత్రించే చర్యలు తీసుకోవటంలో విఫలమవటాన్ని వీరు నిరసించారు. గ్రామస్తులు రాస్తారోకో చేశారు. టిప్పర్లు, వాహనాల రాకపోకలను నిరోధించారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు కాలుష్యాన్ని నిరోధించేందుకు నీటిని చల్లించటం వంటి తక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 19న కారిడార్ వ్యతిరేక, సెజ్ వ్యతిరేక కమిటీ బ్యానర్‌పై వేలాది మంది రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు కాకినాడలోని కలెక్టర్ కార్యాలయాన్ని చుట్టుముట్టారు. తమ జీవనాలను కబళించిన కోస్టల్ కారిడార్‌ను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఫిబ్రవరి 26న 2002 గుజరాత్ దాడుల బాధితులు వారి కుటుంబ సభ్యులు తమకు నష్టపరిహారం కల్పించాలని పియుసిఎల్ ఆధ్వర్యంలో నినాదాలు చేస్తూ అహమ్మదాబాద్‌లో ఆందోళన చేపట్టారు.

మార్చి 4న మెదక్‌జిల్లా- ఖాజిపల్లి, గండిగూడెం, కృష్ణారెడ్డిపేట గ్రామస్తులు పరిసర ప్రాంతాల పారిశ్రామిక వ్యర్థాలను తీసుకువచ్చి ఖాజిపల్లి ప్రజల నివాస ప్రాంతాలవద్ద కుమ్మరించటాన్ని వారు తీవ్రంగా నిరసించారు. తమ నివాస ప్రాంతాలలో చేరిన ఈ రసాయన పారిశ్రామిక కాలుష్యాల కారణంగా సంభవిస్తున్న ఆరోగ్య విపత్తులను వారు పేర్కొన్నారు.

మార్చి 24న పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తాల్లమెరక గ్రామ మత్స్యకారులు ఆర్‌డిఓ కార్యాలయం ఎదుట నిరసన తెలిపి, కార్యాలయాన్ని దిగ్బంధించారు. తమపై భూస్వాములు సాగించిన దాడి, నేరస్తులను అరెస్టు చేయకపోవటం పట్ల వారు తమ నిరసన వ్యక్తం చేశారు.

మార్చి 29న 'కిసాన్ సంఘర్ష సమితి' బ్యానర్‌పై రైతులు అమృతసర్‌లోని మన్వాలా రైల్వేస్టేషన్‌వద్ద రైల్వేట్రాక్‌ను దిగ్బధించారు. వారు తమ రుణాలు, గిట్టుబాటు ధరలు తదితర డిమాండ్లను ముందుబెట్టారు.

మార్చి 8 నుండి మార్చి 23 వరకు గంగానగర్‌ను ప్రక్షాళన చేయ ాలనే డిమాండ్‌పై పర్యావరణ శాస్త్రవేత్త ఆమరణ దీక్ష చేపట్టాడు. మార్చి 23న ఆయన దీక్ష విరమించాడు. ప్రభుత్వం దీనిపై మన్మోహన్‌సింగ్ ఆధ్వర్యంలో నేషనల్ గంగా రివర్ బేసిక్ అథారిటి సమావేశాన్ని ఏప్రిల్‌లో నిర్వహించటానికి అంగీకరించింది.

మార్చి 26న భారతదేశంలో బి.టి. ప్రత్తి ప్రవేశపెట్టి దశాబ్ధకాలమైన సందర్భంగా జన్యుమార్పిడి విత్తనాల ప్రవేశాన్ని వ్యతిరేకిస్తూ దేశవ్యాపితంగా నిరసన కార్యక్రమాలు జరిగాయి. 'ఢిల్లీ ఎలయిన్స్ ఫర్ సేఫ్ ఫుడ్, సంస్థ ఆధ్వర్యంలో జంతర్‌మంతర్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. ఇదే తరహా నిరసన ప్రదర్శనలు పత్తిపంటకు కేంద్రాలైన ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటకలలోనూ జరిగాయి. జన్యుమార్పిడి సాంకేతికతను నిషేధించవలసిందిగా ఆగ్రహంతోనున్న రైతులు పార్లమెంటు సభ్యులను డిమాండ్ చేశారు.

ఏప్రిల్ 2న 'న్యూక్లియర్ పవర్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' ఆధ్వర్యంలో హర్యానాలోని ఫతేబాద్ జిల్లా-గోరఖ్‌పూర్‌లో నిర్మించనున్న అణువిద్యుత్ కేంద్రానికి వ్యతిరేకంగా పెద్దస్థాయిలో ఇప్పటికే ముగ్గురు రైతులు తమ ప్రాణాలను కోల్పోయారని ఆందోళన కారులు పేర్కొన్నారు.

ఏప్రిల్ 11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం- వరంగల్‌జిల్లా-ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులు ఆగ్రహంతో ఆందోళనకు పూనుకున్నారు. వ్యాపారస్థులు, యార్డు అధికారులు కుమ్మక్కై రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటా మిర్చి రూ. 5,500 వుండగా ఒక్కసారిగా దానిని రూ. 2000కు తగ్గించటంతో ఆగ్రహించిన రైతులు మార్కెట్ కమిటి కార్యాలయంపై రాళ్ళురువ్వారు. మరికొందరు కార్యాలయంలోని సామాగ్రిని, కంప్యూటర్లను, తూకం యంత్రాలను ఒకచోట వేసి తగుల బెట్టారు.

ఏప్రిల్ 10న భోపాల్ విషవాయు బాధితులు న్యూఢిల్లీలోని భారత ఒలంపిక్ సంఘ అధ్యక్షుడు విజయకుమార్ మల్హోత్రా నివాసం ఎదుట నిరసన బైఠాయింపు జరిపారు. లండన్‌లో జరగనున్న ఒలంపిక్స్-2012కు డౌ కెమికల్స్ యొక్క ప్రాయోజితాన్ని వారు నిరసించారు.

ఏప్రిల్ 11న-అస్సామ్‌లోని కామరూప్ జిల్లాలో దారిద్ర్యరేఖకు దిగునన జీవిస్తున్న పేద ప్రజానీకం, తమకు ఉచిత విద్యుత్తు అందించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపట్టారు.

మార్చి 1న విశాఖజిల్లా, మాకవారిపాలెం మండలం రాచపల్లి గ్రామంలో 'నిర్వాసిత కార్మికుల సంక్షేమ సంఘం' ఆధ్వర్యంలో ఆన్‌రాక్ అల్యూమినా కంపెనీ ఎదుట ఆమరణదీక్షలను ప్రారంభించారు. వారు నిర్వాసితుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. వారు కొంత మంది కార్మికులను కంపెనీలోనికి వెళ్ళనీయకుండా అడ్డుకోవటంతో కార్మికులలోని వ్యతిరేక బృందం ఘర్షణలకు దిగింది. దీనిని ఆసరాచేసుకొని పోలీసులు రంగప్రవేశం చేసి కార్మికులపై లాఠీఛార్జీ జరిపి, వారిని తరిమి వేయటంతో పాటు, ఆమరణ నిరాహారదీక్షా శిబిరాన్ని కూడా తొలగించివేశారు. ✡


**కాంతి కేంద్రాలా! మృత్యు మందిరాలా ?**

పరమాణు విద్యుత్ శక్తి గురించిన శాస్త్ర, సాంకేతిక, జీవావరణ, ఆర్థిక, రాజకీయ విశ్లేషణ
ఓ. పి. డి. ఆర్. అధ్యయన బృందం నివేదిక
వెల: రు. 15/-

**మైత్రి బుక్ హౌస్**
28-9-1, జలీల్‌వీధి, ఏలూరురోడ్, విజయవాడ

# గుత్తాధిపత్యంతో పొగాకు రైతాంగాన్ని దోచుకుంటున్న ఐటిసి

**ప్రపంచ** పొగాకు ఉత్పత్తిలో 3వ స్థానంలో ఉన్న మన దేశం 9% పొగాకును ఉత్పత్తి చేస్తుంది. సిగరెట్ ఉత్పత్తికి పనికివచ్చే ఫ్లూ క్యూర్డ్ వర్జీనియా (ఎఫ్‌సివి) పొగాకు భారతదేశపు మొత్తం పొగాకు ఉత్పత్తిలో 3వ వంతు మాత్రమే. అయితే ఈ ఎఫ్‌సివి పొగాకు ఉత్పత్తిలో దేశంలో ప్రథమ స్థానంలో ఉన్న మన రాష్ట్రం 65% ఉత్పత్తి చేస్తుంది. రాష్ట్రం మొత్తంలో పొగాకు ఉత్పత్తిలో అగ్రస్థానంలో ఉన్న ప్రకాశం జిల్లా 60% ఉత్పత్తిని అందిస్తుంది.

వృక్షశాస్త్ర పరిభాషలో నికోటియానా టుబాకం, నికోటియానా రష్టికా అని పిలువబడే రెండు జాతులను ప్రధానంగా మన రాష్ట్రంలో సాగుచేస్తున్నారు. కొంతమేర ఔషధ పరిశ్రమలో కూడా వినియోగించబడే ఈ ఆకు ప్రధానంగా సిగరెట్లు, బీడి పరిశ్రమకు ముడిసరుకుగా ఉంది. దేశ వ్యాప్తంగా 7,50,000 మంది రైతులు, 47,00,000 మంది వ్యవసాయ కూలీలు, 44,00,000 మంది బీడీ కార్మికులు, 5,00,000 మంది సిగరెట్ పరిశ్రమ కార్మికుల కుటుంబాలు ఈ పంటపై ఆధారపడి జీవిస్తున్నారు.

పొగాకు, పొగాకు ఉత్పత్తుల వాణిజ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ప్రతి సంవత్సరం సుమారు 15 వేల కోట్ల రూపాయలు కస్టమ్స్, ఎక్సైజ్ పన్నుల రూపంలో ఆదాయం అందుతుంది. ఎరువులు, పురుగుల మందులపై పన్నుల ద్వారా వచ్చే ఆదాయం దీనికి అదనం. 4,300 కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యం పొగాకు వ్యాపారం ద్వారా మన దేశానికి లభిస్తుంది. ఇక రాష్ట్ర ప్రభుత్వానికి సిగరెట్లపై విధిస్తున్న 20 శాతం వ్యాట్ ద్వారా గత 5 సంవత్సరాలలో 2000 కోట్ల రూపాయల ఆదాయం వచ్చింది. పొగాకు బోర్డుకు రైతులు, వ్యాపారుల నుండి సర్వీస్ ఛార్జీల పేరిట సంవత్సరానికి 66 కోట్లు, రైతులపై పెనాల్టీల ద్వారా 44 కోట్లు, సెస్ ద్వారా మరో 34 లక్షలు ఆదాయం వస్తుంది.

ప్రకాశం జిల్లాలో ప్రధాన వాణిజ్యపంటగా ఉన్న పొగాకును జిల్లాలోని 29,000 మంది రైతులు 1,68,636 ఎకరాలలో సాగు చేస్తున్నారు. వీరిలో 40% మంది కౌలు రైతులు. మిగిలిన వారు కూడా పేద, మధ్యతరగతి రైతులే. 1,50,000 మంది వ్యవసాయ కూలీలకు 8 నెలల పాటు ఉపాధి కల్పించే పంట ఇది. వీరంతా ప్రధానంగా దళిత, బలహీన వర్గాల మహిళలు. ఇంత మంది జీవనోపాధి పట్ల ప్రభుత్వం ఎంత కుట్ర పూరిత నిర్లక్ష్యం వహిస్తుందో పొగాకు బోర్డు వారి గణాంకాల ప్రకారమే పరిశీలిద్దాం. (వాస్తవ గణాంకాలు తరువాత చర్చిద్దాం) ఎకరానికి పెట్టుబడి నల్ల నేలల్లో రూ. 55,773/- గానూ, తేలిక నేలల్లో రూ. 58,615 గానూ బోర్డువారు ప్రస్తుత సీజన్‌కు అంచనా వేశారు. ఎకరానికి నల్లనేలల్లో 575 కిలోలు, తేలిక నేలల్లో 558 కిలోల దిగుబడిని ఊహించి, ఉత్పత్తి ఖర్చులు కిలోకి నల్ల నేలల్లో 101.89 రూపాయలు, తేలిక నేలల్లో 104.98 రూపాయలుగానూ లెక్క తేల్చారు. వచ్చే సంవత్సరం ఉత్పత్తి ఖర్చు మరో 10 శాతం పెరగనుందనీ అందుకు ప్రధాన కారణం కూలిరేట్లు పెరగడమనీ "ఎఫ్‌సిఒ ధరల విధానం 2012-13" అనే పత్రంలో అభిప్రాయపడ్డారు. గత సంవత్సరం 169.62 మిలియన్ కిలోలు పొగాకు పండించటానికి బోర్డు అనుమతించింది. కానీ 207.58 మి. కిలోల పొగాకు కొనుగోలు జరిగింది. అంటే లక్ష్యం కంటే ఉత్పత్తి అధికంగా జరిగింది. అపుడు ఎఫ్1 గ్రేడు పొగాకుకు గరిష్టంగా రూ. 124/- ధర లభించింది. ఈ సంవత్సరం 166.19 మిలియన్ కిలోల ఉత్పత్తికి బోర్డు అనుమతులు ఇచ్చింది. ఉత్పత్తి 163 మి. కిలోలకు మించేలా లేదని బోర్డే అంచనా వేసింది. అంటే లక్ష్యం కంటే ఉత్పత్తి తగ్గింది. ఉత్పత్తి తగ్గినపుడు డిమాండ్ పెరిగి ధర పెరగాలి కదా! కానీ ఈ సంవత్సరం ఎఫ్1 ప్రారంభ ధర రూ. 110/- మాత్రమే. బోర్డు వారే చెప్పినట్లు ఉత్పత్తి ఖర్చులు గణనీయంగా పెరిగాయి. ఉత్పత్తి తగ్గింది. కానీ ధర మాత్రం పెరగలేదు సరికదా! తగ్గింది!! అత్యంత నాణ్యమైన ఎఫ్1 రూ. 110/- ధర లభించినా అన్ని గ్రేడుల సగటు ధర రూ. 70/- మాత్రమే రైతుకు లభిస్తుంది. ఉత్పత్తి ఖర్చు కిలోకి 102-105 రూపాయలుగా బోర్డు లెక్కలే చెప్తుంటే రైతుకు సగటు ధర రూ. 70/- మాత్రమే రైతుకు లభిస్తుంది. రైతు ఈ విధంగా దివాళా తీస్తుంటే మరి రైతుని మార్కెట్ దోపిడీ నుండి రక్షించడానికి ఏర్పాటు చేయబడ్డ బోర్డు ఏంచేస్తున్నది? ప్రభుత్వం ఏం చేస్తున్నది?

బోర్డు లెక్కల ప్రకారమే పొగాకు రైతులు పీకల్లోతు నష్టాల్లో కూరుకుపోయి ఉండగా వాస్తవ ఖర్చులు క్రింది విధంగా ఉన్నాయి. పెట్టుబడి ఆయా ప్రాంతాలలోని మట్టి లక్షణాన్ని, నీటి లభ్యతని, వాతావరణాన్నిబట్టి మారుతుంది. అయితే జిల్లాలో అధిక దిగుబడి, నాణ్యత సాధించే టంగుటూరు ప్రాంత లెక్కల్ని నమూనాగా తీసుకుందాం.

బ్యారన్‌కు సగటున 8 ఎకరాలు పండిస్తారు. ఎకరానికి రూ. 76,000 చొప్పున బ్యారన్‌కు రూ. 6,08,000 ఖర్చవుతుంది. (తక్కువ పెట్టుబడి, తక్కువ దిగుబడి ప్రాంతాలలో 10 ఎకరాలు కూడా సాగు చేస్తారు కాబట్టి పెట్టుబడి సగటున అందరికీ సమానమే) ఒక బ్యారన్‌కు సగటు దిగుబడి 48 క్వింటాలు, సగటు ధర

| | |
|---|---|
| కౌలు | 10,000 |
| దున్నకం | 3,500 |
| ఎరువులు | 5,000 |
| నారు | 5,000 |
| నాట్లు కూలి | 2,500 |
| అంతర సేద్యం | 3,000 |
| పురుగుమందులు | 2,500 |
| స్ప్రేయర్ కూలి | 500 |
| నీరు కట్టుడు | 5,000 |
| పాలింపులు, పురుగుల ఏరివేత | 1,000 |
| ఆకు రెలుపు | 10,000 |
| కాల్పుకు కలప | 10,000 |
| టోకర్ | 2,500 |
| గ్రేడింగ్ | 1,500 |
| పచ్చాకు బాడుగ | 2,000 |
| చెక్కులు బాడుగ | 1,000 |
| బారన్ | 6,000 |
| పర్యవేక్షణ | 5,000 |
| ఎకరానికి | రూ. 76,000 |

7000/- చొప్పున బ్యారన్‌కు రాబడి 3,36,000/- ఉంటుంది. అంటే నికర నష్టం 2,72,000/- ఈ నష్టాలకు కారణాలేమిటి?

డీజిల్ ధరలు పెరిగినందున ట్రాక్టర్ బాడుగలు పెరగటం, కౌలు రేట్లు, కూలి పెరగటంతో ప్రతి సంవత్సరం పెట్టుబడి ఖర్చు పెరిగిపోతూనే ఉంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటుతున్నందున ప్రస్తుత కూలి కుటుంబపోషణకి సరిపోయేది కాదు. కాబట్టి కూలిరేట్లు పెంచడం రైతు బాధ్యత. డీజిల్ ధరలు, నిత్యావసర వస్తువుల ధరలు, కౌలు రేట్లు ప్రభుత్వం నియంత్రించకపోవడం రైతుకు శాపంగా మారింది. ఒక కిలో పొగాకును సగటున రూ. 70/-కి కొంటున్న కంపెనీలు రూ. 250/-కి ఎగుమతి చేస్తున్నారు. సిగరెట్ కంపెనీలు ఒక కిలో పొగాకుతో కనీసం 1200 సిగరెట్లు తయారు చేసి కిలో పొగాకుపై రూ. 6000/- లాభాలు ఆర్జిస్తున్నాయి. అంటే రైతులు అప్పులపాలు కావడానికి కారణం పొగాకు బోర్డు, కొంతమంది రైతు నాయకులు చెప్తున్నట్లు నాణ్యత లేకపోవడం, అన్యపదార్ధాలు కలవడం, కూలిరేట్లు పెరగడం ఎంతమాత్రం కాదు. రైతు శ్రమని కారుచౌకగా కొల్లగొడుతున్న వ్యాపారులు, సిగరెట్ కంపెనీల నుండి మంచి ధర రాబట్టుకోలేక పోవడమే అసలు కారణం.

వేలం కేంద్రాలలో పొగాకు కొనుగోలు చేసేందుకు ఈ సంవత్సరం మొత్తం 794 మంది వ్యాపారులు రిజిష్టర్ చేసుకోగా వేలం ప్రారంభమై 3 నెలలు కావస్తున్నా ఇప్పటివరకూ కేవలం నలుగురు వ్యాపారులే వేలంలో పాల్గొంటున్నారు. వారిలో కూడా మొత్తం కొనుగోళ్ళలో 90% ఒక్క ఐటిసి మాత్రమే చేస్తుంది. మిగిలిన వ్యాపారులందరినీ తనకు సప్లయర్లుగా మార్చుకుని తన కనుసన్నలలో పొగాకు మార్కెట్‌ను నడిపిస్తుంది. వేలం కేంద్రాలవైపు కన్నెత్తి కూడా చూడని వ్యాపారులపైన, వేలంలో సిండికేట్ పద్ధతుల్లో రైతుకు అన్యాయం చేస్తున్న ఐటిసిపైనా బోర్డు ఎలాంటి చర్యా తీసుకోకుండా ప్రేక్షక పాత్ర వహించి చోద్యం చూస్తుంది.

2007-08 ఆర్థిక సంవత్సరం వరకూ పొగాకు బోర్డు పంపించే సమాచారం ఆధారంగా కేంద్ర సిఏసిపి పొగాకుకు కూడా కనీస మద్దతు ధరను ప్రకటించేది. 2008-09 నుండి పొగాకు రైతుల్ని పూర్తిగా మార్కెట్ దోపిడికి వదిలేసింది ప్రభుత్వం. రైతులు నిలువు దోపిడీకి గురౌతుంటే ఐటిసికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు ఎన్నికల సీజన్ రాగానే రైతుల కష్టాల గురించి మొసలి కన్నీరు కారుస్తుంటారు. తమ నటనతో, వంచనతో ఓట్లు పొంది గెలిచాక ఐటిసితో కుమ్మక్కై అధికారాన్ని అడ్డం పెట్టుకుని రైతు ప్రయోజనాలను పణంగా పెట్టి కమిషన్లు దండుకుంటున్నారు.

జిల్లా ఇంతగా పొగాకు పంటపై ఆధారపడి ఉంటే పొగాకు బోర్డు సభ్యులుగా ఉన్న అధికార పార్టీ ఒంగోలు ఎం.పీ. మాగుంట శ్రీనివాసరెడ్డికానీ, ప్రతిపక్ష బిజెపి అగ్ర నాయకుడు వెంకయ్యనాయుడు కానీ రైతుల పక్షాన పల్లెత్తు మాటైనా మాట్లాడిన దాఖలాలు లేవు. ప్రజల్లో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడానికి రాజీనామా నాటకాలాడిన అధికార ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఎవరూ కూడా రైతుల కోసం రాజీనామా చేస్తామని అనలేదు. కనీసం అసెంబ్లీలో ప్రస్తావించలేదు. ఐటిసికి అమ్ముడు పోయిన కొంతమంది రైతు నాయకులు గిట్టుబాటు ధర కోసం మొక్కుబడి ఆందోళనలు చేస్తూ అన్యపదార్థాలు, కూలిరేట్లు అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. ఇలాంటి నాయకుల మోసాలకు బలవ్వకుండా రైతాంగం సమైక్యంగా ప్రజాప్రతినిధుల్ని నిలవేయాలి. ప్రభుత్వం ఐటిసి ఇతర వ్యాపారుల మీద ఒత్తిడి తెచ్చి సరైన ధర ఇప్పించాలి, పెరుగుతున్న పెట్టుబడులకు అనుగుణంగా సిఏసిపితో కనీస మద్దతు ధర 150/-గా ప్రకటించాలి. పొగాకు ఉత్పత్తుల ద్వారా కేంద్ర ప్రభుత్వం పొందుతున్న వేల కోట్ల రూపాయల పన్నుల్లో కనీసం 10%తో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేయాలి. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేనపుడు కోల్ సొసైటీ, పొగాకు ఉత్పత్తిదారుల సమాఖ్యలకు ధరల స్థిరీకరణ నిధి నుండి నిధులు కేటాయించి ప్రభుత్వం కూడా వేలంలో పాల్గొనాలి.

ప్రపంచ పొగాకు ఉత్పత్తిలో వరుసగా 4.6, 1.4, 0 శాతం ఉన్న యూరోపియన్ యూనియన్, రష్యా, జపాన్‌లు వినియోగంలో వరుసగా 10, 6.4, 2 .6 శాతం వాటా కలిగి ఉన్నాయి. అంటే ఆయా దేశాలు వరుసగా 5.4, 5, 2.6% లోటును కలిగి ఉన్నాయి. అటువంటి దేశాలలో ఉన్న మన రాయబార కార్యాలయాలకు లక్ష్యాలు నిర్ణయించి ఆర్డర్లు సేకరింప జేయాలి. ఈ దేశాలన్నింటి నుంచి మనం వివిధ వస్తువుల్ని దిగుమతి చేసుకుంటూనే ఉన్నాం కాబట్టి ప్రభుత్వ స్థాయి చర్చల్లో కూడా పొగాకు ఆర్డర్లకై పట్టు బట్టాలి. జిల్లాలో ప్రభుత్వరంగ సిగరెట్ ఫ్యాక్టరీని నిర్మించడం ద్వారా ప్రభుత్వం పొగాకు సేకరణ చేయాలి. ఇవేవీ ప్రభుత్వం చేయలేనపుడు రైతులకు, వ్యవసాయ కూలీలకు ప్రత్యామ్నాయం చూపించాలి. ఈ డిమాండ్లు ఏవీ ఆచరణ సాధ్యం కానివి కాదు. అత్యాశకాదు. రైతు మనుగడకు లక్షలాది మంది వ్యవసాయ కూలీల మనుగడకు మరో మార్గంలేదు. ఈ డిమాండ్లు సాధించుకోవడానికి వ్యవసాయ కూలీలను కూడా కలుపుకుని రైతాంగం సమైక్యంగా ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తేవాలి. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా బలమైన ఉద్యమ కార్యక్రమాన్ని రూపొందించుకోవాలి.

– లలిత ✡

## ఝార్ఖండ్.... (3వ పేజీ నుండి)

తీరే ఆర్థిక వ్యవస్థలు ఏర్పడవచ్చు. అయితే ప్రభుత్వం ఇలాంటివి చేస్తుందా? మనం పోరాడి గ్రామాలలోని నిత్యావసరాలైన విద్య, వైద్యసేవలు సాధించుకోవాల్సి ఉంటుంది. మనం మన భూముల్ని రక్షించుకోవాల్సి ఉంటుంది. అంతే కాకుండా ఇక్కడే మనందరి పిల్లల భవిష్యత్తు నిర్మించుకోవాల్సివుంటుంది. మనకు వలస పోవడం తప్ప మరొక స్థితిలేదని భావించాల్సిన అవసరమే లేదు. ప్రభుత్వానికి ఈ విషయాన్ని తెలియజెపుదాం! ఝార్‌ఖండ్ ప్రాంత సంపదలు మొదట ఇక్కడి ప్రజలకే చెందాలి. ఈ ప్రాంత ప్రజల అవసరాలు తీరిన తర్వాతే ఇతరులు ఉపయోగించుకోవాల్సి ఉంటుంది.

మనం ఝార్‌ఖండ్, ప్రజల యొక్క నిజమైన అభివృద్ధి కొరకు, ప్రభుత్వ విధానాలను మార్చేందుకు పోరాడాల్సి ఉంటుంది. గ్రామీణ వికాసానికి ప్రాధాన్య మిచ్చే సరైన విధానాల కోసం పోరాడాల్సి ఉంటుంది. మిత్రులారా! చట్టాలు ఉన్నప్పటికీ భూములు లాగేసుకుంటూనే ఉన్నారు. ఇది ఒక విషయాన్ని స్పష్ట పరుస్తుంది. చట్టాలు చేసినంతమాత్రాన్నే అవి ఉన్నంత మాత్రాన్నే సరిపోవు. పోరాటం లేకుండా మన భూముల్ని మనం కాపాడుకోలేము. మనం పోరాటం సాగించాలి. ప్రజలకు అనుకూలమైన ఏ చట్టాలనూ ప్రభుత్వం ప్రేమతోనో, వారి మేలుకోరో చేయలేదు. వాటి వెనక ఎన్నో పోరాటాల, ఎన్నో త్యాగాల వారసత్వం వాటిని తెచ్చిందని చరిత్ర మనకు చెబుతోంది. 8 గంటల పనిదినం, సమానవేతన చట్టం, భూ ఆక్రమణల నిరోధక చట్టం (గరిష్ట భూ పరిమితి చట్టం) సిఎన్‌టి చట్టం, ప్రదర్శనలు చేసేహక్కూ, ధర్నాలు, ఆందోళనలు, రాస్తారోకోలు చేసే స్థితి...అన్నీ సంఘర్షణలోంచి సాధించుకున్నవే! పాలకుల కోరికలకు వ్యతిరేకంగా తయారైన ఇలాంటి చట్టాలను ప్రభుత్వం, వారి అనుయాయులు ఎల్లప్పుడూ వాటిని నాశనం చేయాలనో లేక వాటి ప్రభావతీవ్రతను తగ్గించాలనో చూస్తారు. ఈ చట్టాలు, హక్కుల కోసం పోరాడేవారందరిపై ప్రభుత్వం అభివృద్ధివ్యతిరేకులనో, నక్సలైట్లనో ముద్రవేసి అణచి వేయాలని చూస్తూవుంది. ఈ పెట్టుబడిదారీ దుర్మార్గ విధానాల్ని అర్థంచేసుకోడానికి, ఇప్పుడు కొనసాగుతున్న దోపిడీ, పీడన, అణచివేతలు, గ్రామాలకు గ్రామాలనే ఖాళీచేయించడాలూ సరిపోవా? రండి! ప్రజావ్యతిరేక, అభివృద్ధి వ్యతిరేక అణచివేతలకు వ్యతిరేకంగా, ఝార్‌ఖండ్ గ్రామీణ వికాసం కోసం మన పోరాటాల్ని పదును పెట్టుకుందాం! అందరం అన్ని ఆలోచనలు, విమర్శలతో చర్చలో భాగస్వాములమవుదాం. ✡


ఎన్.వై.ఎస్. ప్రచురణలు

అప్పుల ఊబికి అందమైన పేరే

మైక్రోఫైనాన్స్ 5/-

తరతరాల విధ్వంసం 5/-

భోపాల్‌లో నాడు జరిగిందేమిటి?

మళ్ళీ జరగవని గ్యారంటీ ఏమిటి?

కాపీలకు: మైత్రీ బుక్ హౌస్

జలీల్ వీధి, అరండల్‌పేట,

విజయవాడ


## పశ్చిమబెంగాల్ ఏఐఎఫ్‌టియు(న్యూ) శాఖ ఏర్పాటు

**అసంఘటిత** రంగంలో వివిధ విభాగాలలో పనిచేస్తున్న కార్మికులు- ఉత్తర బెంగాల్‌లోని కుచ్‌భీహార్ జిల్లా, తుఫాన్‌గంజ్ ప్రాంతంలో ఒక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పశ్చిమబెంగాల్ ఎఐఎఫ్‌టియు(న్యూ) శాఖగా ఏర్పడ్డారు.

ఆల్ వెస్ట్‌బెంగాల్ టీ గార్డెన్ లేబర్ యూనియన్; వ్యాన్-రిక్షా-ముటియా మజ్దూర్ యూనియన్; బీడీ వర్కర్స్ యూనియన్; ఫారెస్టు వర్కర్స్ యూనియన్‌ల ఆధ్వర్యంలో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో పనిచేసే కార్మికులు 2012 మే5న ఒక రోజు సదస్సు నిర్వహించుకున్నారు.

సదస్సు ప్రాంగణానికి కానూసన్యాల్ నగర్ గాను; వేదికను బబ్లు మోడక్ మంచ్ గానూ పేర్లను వుంచారు. ఈ సదస్సుకు ముగ్గురు క్రామేడ్స్ అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. అమరులకు సంతాపం తెలియ జేయటంతో సదస్సు ప్రారంభమైంది. కా॥ ధీరేన్ దాస్ ప్రతినిధులకు ఆహ్వానం పలుకగా, సదస్సు ప్రాధాన్యతను, నేపథ్యాన్ని కా॥ సుబ్రతబసు వివరించారు. అనంతరం ఎఐఎఫ్‌టియు (న్యూ) అధ్యక్షులు కా॥ జి. విజయకుమార్ ఎఐఎఫ్‌టియు(న్యూ) లక్ష్యాలు-కర్తవ్యాలను సదస్సు ప్రతినిధుల ముందు వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో వివిధ ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో సాగుతున్న కార్యక్రమాలను టీతోట కార్మికుల ప్రదాన కార్యదర్శి కా॥ ప్రదీప్ దేవనాథ్ సంక్షిప్తంగా వివరించారు. వీటిపై ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు.

కా॥ ధీరేన్‌దాస్ అధ్యక్షుడిగా, స్వదేశ్ బెనర్జీ వర్కింగ్ ప్రసిడెంట్‌గా; కా॥ రామగణేష్‌బారికే ప్రధాన కార్యదర్శిగా, ప్రదీప్ దేవనాథ్ కోశాధికారిగా 9 మందితో పశ్చిమ బెంగాల్ రాష్ట్ర ఎఐఎఫ్‌టియు(న్యూ) శాఖ ఏర్పడింది.

సదస్సుకు ముందురోజు మే 4న తుఫాన్‌గంజ్ పట్టణంలో కార్మికుల స్ఫూర్తిదాయకమైన ప్రదర్శన అనంతరం విఐపిమోర్ కూడలిలో బహిరంగసభ జరిగాయి. ఈ సభ కార్మికులపై ఒక ఉత్తేజకరమైన ప్రభావాన్ని పడవేసింది. ఈ సభకు కా॥ జి. విజయకుమార్ ప్రధాన వక్తగా హాజరైనారు. ఇంకా ఈ సభలో కా॥ ధీరేన్‌దాస్, కా॥ స్వదేశ్ బెనర్జీ, కా॥ రామ్‌గణేష్‌బారికే ప్రసంగించగా ఈ సభకు కా॥ శిఖాదాస్ అధ్యక్షత వహించారు. ✡

# భూ వివాద పరిష్కారం పట్ల ప్రభుత్వపట్టనితనమే
# లక్ష్మింపేట దళితులపై హంతక దాడికి కారణం

**శ్రీకాకుళం** జిల్లా - వంగర మండలం - లక్ష్మింపేట గ్రామంలో 13-6-12 తెల్లవారు ఝామున దళితులపై పెత్తందార్ల ప్రోద్బలంతో వెనుకబడిన కులాలవారు కొందరు జరిపిన హంతకదాడులలో నలుగురు దళితులు మరణించారు. ఇరువర్గాలలోను 30 మందిపైగా గాయపడ్డారు. దళితులపై జరిగిన ఈ హేయమైన దాడిని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) తీవ్రంగా ఖండిస్తున్నది.

సువర్ణముఖి-వేగావతి నదుల సంగమ స్థలంలో మడ్డువలస జలాశయ నిర్మాణానికి 1977లో ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లించి భూసేకరణ చేసింది. నిర్వాసితులకు ముత్యాలమ్మ చెరువు సమీపంలో పునరావాసం కల్పించింది. అయితే జలాశయం నిర్మాణం తర్వాత ముంపుకు ఆవల వుండిపోయిన 250 ఎకరాల భూములను, ఆ భూములను ఇచ్చిన రైతులే తిరిగి సాగుచేసుకుంటూ వస్తున్నారు. ఇందులో ఎక్కువ శాతం భూములు బి.సి.లవి. ఇవన్నీ ప్రభుత్వం సేకరించిన భూములు కనుక తమకూ వాటా ఇవ్వాలని దళితులు కోరుతున్నారు. వీరి మధ్య పోటీని నివారించే పేరిట ప్రభుత్వాధికారులు ఇరువర్గాలలో ఎవరూ ఆ భూములను సాగుచేయరాదని పంచాయితీ చేసి వారిరువురి మధ్య కక్షలు పెరిగేందుకు కారణ మయ్యారు. ఈ క్రమంలో ఇరు వర్గాల మధ్య పలుపర్యాయాలు ఘర్షణలు, కొట్లాటలూ జరుగుతూ వస్తున్నాయి. లక్ష్మింపేట గ్రామంలో గత 3 నెలల నుండి పోలీసు పికెట్ కొనసాగుతున్నది. అయినా పరస్పర ఆరోపణలు-కేసులు పెట్టుకోవటం వంటి చర్యలు సాగుతున్నప్పటికీ ఉద్రిక్తతలు నెలకొంటు న్నప్పటికీ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం పూనుకోకపోగా ఉపఎన్నికల బందోబస్తుకోసమంటూ, కొనసాగుతున్న పోలీసుపికెట్‌ను కూడా ఎత్తివేసింది.

ఇదే అదనుగా స్థానిక పెత్తందార్ల ప్రోద్బలంతో బిసి వర్గీయులు కొందరు, దళితులపై నాటు బాంబులు, బల్లాలు, కత్తులతో దాడిచేసి నలుగురిని బలిగొన్నారు-ఇరువర్గాలలో 30 మంది పైగా గాయపడ్డారు.

ఆ గ్రామంలో భూమి సమస్యను పరిష్క రించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వమే ఈ సంఘటనకు పూర్తిగా బాధ్యత వహించాలి.

సంఘటన జరిగిన తర్వాత ముఖ్యమంత్రి, మంత్రులు, ప్రభుత్వ అధికారులు బాధితులు పరామర్శించటం, మృతుల కుటుంబాలకు పరిహారాన్ని ప్రకటించటం, దోషులను కఠినంగా శిక్షిస్తామని ప్రకటించి చేతులు దులుపుకోవటం, పరిపాటి అయిపోయింది.

ఉద్రిక్తతలు కొనసాగుతున్న గ్రామంలోని బిసి-ఎస్సీల నడుమ పోలీస్ పికెట్‌ను పెట్టడంద్వారా సమస్యను పరిష్కరించటం సాధ్యం కాదని తెలిసీ 'పోలీస్' పరిష్కారానికే ప్రభుత్వం పూనుకుంది. వాస్తవానికి భూమి అవసరం వున్న వారిని గుర్తించి వారికి సాగుచేసుకునే అవకాశాన్ని కల్పించటం ద్వారా ఈ సమస్య సామరస్య పరిష్కారానికి దోపిడీ ప్రభుత్వ పాలకులు యోచిస్తారని ఆశించటం వృధానే అవుతుంది.

భారతదేశంలో నేటికీ కొనసాగుతున్న అర్ధభ్యూడల్ వ్యవస్థ, నిచ్చెనమెట్ల కులవ్యవస్థను పెంచిపోషిస్తున్నది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో అగ్రకుల భూస్వామ్య పెత్తందార్ల ఆధిపత్యం, దాడులు-దౌర్జన్యాలు సర్వసాధారణమయ్యాయి. అగ్రకుల భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలకు-కులవివక్షకు గురౌతున్న వెనుకబడిన కులాలవారు, సామాజికంగా తమ క్రింది మెట్లవారిపై తిరిగి అదే విధమైన వివక్ష, ఆధిపత్యం చెలాయించటమే మనువాద సంస్కృతి! భారతదేశంలో కుల వ్యవస్థ-శ్రమ విభజనకాదు-శ్రామికుల విభజన'.

లక్ష్మింపేటలో భూమిహీనులైన, భూ దాహంతో నున్న పేదలందరినీ వర్గప్రాతిపదికపై సమీకరించటం ద్వారా, ఆయా కులాలలోని పెత్తందార్లపై ఎక్కుపెట్టి, మనువాద సంస్కృతిని పెంచిపోషిస్తున్న ప్రభుత్వ, పాలకుల విధానాలను ఓడించటం ద్వారానే పేదల ఐక్యత నిలబడుతుంది, వారి భూమి సమస్య పరిష్కార మౌతుంది. పేదల మధ్య అనైక్యతను పెంచిపోషించే దోపిడీ పాలకులు, పాలకవర్గ పార్టీలు తమ ఎన్నికల ఓట్ల ప్రయోజనాల కనుగుణంగా మొసలికన్నీరు కార్చటం మినహా పేదల భూమి సమస్య పరిష్కారానికి పూనుకోవని గుర్తించిన పేదలంతా సమైక్య పోరాటాలకు సంసిద్ధం కావాలని రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) పిలుపునిస్తున్నది.

- లక్ష్మింపేట దళితులపై హంతకదాడులకు పాల్పడనవారందరినీ శిక్షించాలి. దీనికి పథక రచన చేసిన పెత్తందార్లను, పాలక పార్టీల నాయకులను అరెస్టు చేసి శిక్షించాలి.
- హత్యకు గురైన వారి కుటుంబాలకు పరిహారం చెల్లించటంతో పాటుగా లక్ష్మింపేట దళితుల, వెనుకబడిన కులాల పేదలందరికి భూమిని కల్పించి వారి భూమి సమస్యను వెనువెంటనే పరిష్కరించాలి.

**విజయవాడ** **ఎస్. ఝాన్సి**

**14-6-2012** **అధ్యక్షులు,**

**రైతుకూలీసంఘం (ఆం.ప్ర.)**

# పెంచిన పెట్రోల్‌ధరలను మొత్తంగా, వెనువేంటనే ఉపసంహరించాలని ఆందోళన

**పెట్రోల్‌ధర లీటరకు రు.7.85 నుండి రు.8.36 వరకు పెంచుతూ ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పెంచిన పెట్రోల్ ధరలను మొత్తంగా, వెనువేంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ 31-5-12న అఖిల భారత బంద్‌కు సిపిఐ(ఎం-ఎల్) కేంద్రకమిటి పిలుపు నిచ్చింది. మన రాష్ట్రంలో అందిన మేరకు రిపోర్టలను సంక్షిప్తంగా అందిస్తుంది**

**-సంపాదకుడు**



మే 31 బంద్ సందర్భంగా నిజామాబాద్‌లో రాస్తారోకో

### మచిలిపట్నం

పెట్రోల్ ఛార్జీల పెంపును వ్యతిరేకిస్తూ 11 వామపక్షాల పిలుపులోభాగంగా సిపిఐ(ఎం-ఎల్), సిపిఎంలు పట్టణంలో బందు నిర్వహించాయి. ప్రభుత్వ కార్యాలయాలు, మార్కెట్‌షాపులను మూసి వేశారు. ప్రధాన కూడళ్ళలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జనంపాటలతో ప్రదర్శన నిర్వహించారు.

సిపిఐ(ఎం-ఎల్) జిల్లా నాయకులు కా॥ యుద్దనపూడి సోని, రైతుకూలీసంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ జె.జగన్; అంజమ, ఉమా మహేశ్వరావు, తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### చల్లపల్లి

రైతుకూలీలసంఘం, వైయస్సార్ సిపి, సిపిఐ, సిపిఎం, టిడిపిల ఆధ్వర్యంలో చల్లపల్లి బంద్ జరిగింది. ఈ సందర్భంగా వివిధ కూడళ్ళలో ఇతర పార్టీలనాయకులతో పాటు, రైతుకూలీసంఘం (ఆం.ప్ర) జిల్లానాయకులు కా॥ ఈపూరి రాంబాబు ప్రసంగిస్తూ కోట్లాదిరూపాయలు లాభాలార్జించుతున్న ఆయిల్‌కంపెనీల కొమ్ముగాస్తున్న ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల్ని ఎండగట్టారు.

### నాగాయలంక

రైతుకూలీసంఘం, తెలుగుదేశం,సి.ఐ.టి.యుల ఆధ్వర్యంలో నాగాయలంకలో బందు విజయ వంతమైంది. ఇతర సంస్థల ప్రతినిధులతో పాటుగా రైతుకూలీసంఘం జిల్లా కోశాధికారి కా॥ తలశీల లీలామనోహర్ మాట్లాడుతూ పెట్రోల్ ధరల నియంత్రణ నుండి ప్రభుత్వం తప్పుకోవటాన్ని తీవ్రంగా నిరసించారు.

### విజయవాడ

సిపిఐ (ఎం-ఎల్), నగరంలో ఇతర వామపక్ష పార్టీలతో కలసి బంద్ విజయవంతం చేయ వలసిందిగా పిలుపు నిస్తూ ముందురోజు ప్రచారం నిర్వహించింది. 31-5-12న లెనిన్‌సెంటర్, బీసెంట్‌రోడ్డు, చల్లపల్లి బంగళా, గాంధీనగర్ తదితర కూడళ్ళలో వర్తక, వ్యాపారాలు స్తంభించాయి. బస్సులు రాకపోకలు ఆగిపోయాయి.సిపిఐ(ఎం-ఎల్) స్థానిక నాయకులు కా॥ అబ్రహం, దుర్గారావు, ఓపిడిఆర్ నాయకులు కె. ఏసు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

స్థానిక వన్‌టౌన్‌ఏరియా, చిట్టినగర్, మార్కెట్ ప్రాంతాలలో స్థానిక నాయకులు కా॥ వి. లక్ష్మణ నాయకత్వన కార్యకర్తలు బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ సెంటర్లలో ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాన్ని నిరసిస్తూ వామపక్షపార్టీల నాయకులు ప్రసంగించారు.

### చోడవరం

పెట్రోచార్జీలపెంపు నిరసిస్తూ ఇచ్చిన బంద్ పిలుపులో భాగంగా పశ్చిమగోదావరిజిల్లా చోడవరం మండల కేంద్రంలో ఏఐఎఫ్‌టియు(న్యూ) స్త్రీవిముక్తి సంఘటన, నవయువ సమాఖ్య ఆధ్యర్యంలో విస్తృత ప్రచారం నిర్వహించి బంద్‌లో పాల్గొన్నారు.

మనదేశంలోని వనరులైన ఇనుము, గ్యాసు, చమురులను విదేశాలకు అముకుంటూ, ఇతర దేశాలలో నుండి తిరిగి దిగుమతులు చేసూకుంటూ, మనదేశప్రజలపై అధికధరల భారాన్నిమోపటాన్ని వారు తీవ్రంగా దుయ్యబట్టారు. స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి కాలేజీ సెంటర్, గాంధీగ్రామం, నర్సయ్యపేట, ఎల్.ఐ.సి. కాలనీ, హాస్పిటల్ సెంటర్‌ల మీదుగా ప్రదర్శన నిర్వహించి, కూడలి సమావేశాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఏఐఎఫ్‌టియు నాయకులు అయితిరెడ్డి అప్పలనాయుడు, స్త్రీవిముక్తి సంఘటన (ఆం.ప్ర) ప్రతినిధి ఓ. లక్ష్మీకుమారి, నవయువ సమాఖ్య ప్రతినిధులు కా॥ గంగారాజు, సతీష్‌లు పాల్గొని న్యాయకత్వం వహించారు.

### మంగళగిరి

పెట్రోఛార్జీలపెంపును నిరసిస్తూ సిపిఐ(ఎం-ఎల్) నాయకులు మంగళగిరిలోని ప్రధాన రహదారుల వెంట ప్రదర్శన నిర్వహించారు. బంద్ కార్యక్రమంలో పాల్గొన్నారు. శాంతియుతంగా ఆందోళనచేస్తున్న నాయకులు అరెస్ట్ చేయటాన్ని సిపిఐ (ఎం-ఎల్) నాయకులు కా॥ జగ్గారావు సుబ్బారావు తీవ్రంగా ఖండించారు. ఇంకా ఈ కార్యక్రమంలో కా॥ కొర్రపాటి ఆదినారాయణ, అంజిరెడ్డి, శివ, అబ్రహం; ప్రజాతంత్ర ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని నాయకత్వం వహించారు.

### రేపల్లె

11 వామపక్ష పార్టీల బంద్ పిలుపులో భాగంగా రేపల్లె ప్రాంతంలో సిపిఐ(ఎం-ఎల్), సిపిఎం, యుసిసిఆర్‌ఐ(ఎం-ఎల్)తోపాటు టిడిపి, వైయస్సార్ కాంగ్రెస్‌లు కలిసి బందు నిర్వహించాయి.

తెల్లవారుఝామున 4.30 గంటల నుండీ స్థానిక ఆర్‌టిసి డిపోవద్ద నిరసన శిబిరాన్ని ఏర్పాటుచేసి బస్సుల రాకపోకలను అడ్డుకున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, వాణిజ్య సంస్థలు, సినిమాహాల్స్ బంద్‌చేశారు.

అనంతరం రేపల్లె పట్టణంలో ప్రదర్శన ఉదయం 11 గంటలకు బస్టాండు సెంటర్‌లో సభ నిర్వహించారు. సిపిఐ నాయకులు కన్నెగంటి రమేష్ అధ్యక్షతన జరిగిన సభలో ఇతర పార్టీల నాయకులతో పాటుగా సిపిఐ (ఎం-ఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముత్తిరెడ్డి శ్రీరాములు ప్రసంగిస్తూ, పెరిగిన ధరలను పూర్తిగా తగ్గించేవరకూ సమైక్య ఆందోళనను కొనసాగించాలని, తీవ్రం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇంకా ఈ సభలో రైతుకూలీ సంఘం(ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ ఎం. శోభారాణి, ఏఐఎఫ్‌టియు నాయకులు కా॥ కేతవరపు సీతారామయ్య; కా॥ ఈశ్వరరావు, వెంకట్రావు, రాజేశ్వరి తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### నిజామాబాద్

మే 31న బంద్ పిలుపును పురస్కరించుకొని రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) ఆధ్వర్యంలో హైదరాబాదు జాతీయ రహదారిపై మాధవనగర్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దఎత్తున ట్రాఫిక్ స్థంభించింది. ప్రదర్శకులనుద్దేశించి రైతుకూలీసంఘం నిజామాబాద్ జిల్లా కార్యదర్శి కా॥ గంగుల నర్సయ్య మాట్లాడుతూ 2002లో 30 రూ॥లుఉన్న పెట్రోలుధర 2012 నాటికి 80 రూ॥లకు చేరిందని, పాలకులు అధికారంలోకి రాకముందు చేసేవాగ్దానాలకు, తర్వాత ఆచరణకు పొంతనలేదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతుకూలీసంఘం కార్యకర్తలతో పాటుగా జిల్లా నాయకులు కె. మారుతి, మల్లేష్, రజియా, నర్సింలు తదితరులు పాల్గొని నాయకత్వం వహించారు.

### అనంతపుర్‌లో ఆందోళనాకారుల అరెస్టు-విడుదల

పెట్రో ఛార్జీలు పెంపును వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు ఇచ్చినబంద్ పిలుపులోభాగంగా అనంతపురం పట్టణంలో బందు జరిగింది ఇతర వామపక్షాలతో పాటు స్థానిక ఏఐఎఫ్‌టియు, రైతుకూలీసంఘం కార్యకర్తలు, వివిధ ట్రేడ్‌యూనియన్ల నాయకులు, కార్మికులు పెద్దసంఖ్యలో రోడ్లపైకివచ్చి బ్యానర్లు, జెండాలు, నినాదాలతో బంద్ పాటించమని వర్తక, వ్యాపార వర్గాలకు విజ్ఞప్తి చేశారు - బంద్‌ను ప్రశాంతంగా నిర్వహించారు. కాగా, సిపిఐ(ఎం-ఎల్) రాష్ట్ర నాయకులు కా॥ పెద్దన్నతోసహా ప్రశాంతంగా ఆందోళనలో పాల్గొన్న 150 మందిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి. అనంతరం విడుదల చేశారు.

*Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*
*and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2*
*Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010*